డా॥ వై.ఎస్.ఆర్.

# రైతు భరోసా

వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ, మత్స్యకార
మరియు పట్టు పరిశ్రమ రైతుల సచిత్ర మాస పత్రిక

సంపుటి - 02 సంచిక - 1 జూలై 2021 పేజీలు - 44








ఇది రైతు మేలు కోరే ప్రభుత్వం
రైతు సేవకే అంకితం

ప్రథమ
వార్షికోత్సవ
శుభాకాంక్షలతో...



**తెలివైన సాగు**

**తక్కువ పెట్టుబడి**
**తక్కువ నీరు**
**ఎక్కువ లాభాలు**



**శ్రీ వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి**
గౌ. ముఖ్యమంత్రి వర్యులు, ఆంధ్రప్రదేశ్.

**శ్రీ కురసాల కన్నబాబు**
వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ మరియు
ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామాత్యులు, ఆంధ్రప్రదేశ్.

## మెట్ట మరియు బోర్ల క్రింద వరి సాగుకు ప్రత్యామ్నాయ పంటల సాగుతో

# అధిక లాభాలు పొందండి




### రూపాయి పెట్టుబడికి వచ్చే లాభం

- కొర్రలు ₹ 2.34
- రాగి: ₹ 2.04
- మొక్కజొన్న: ₹ 1.77
- వరి: ₹ 1.39
- వేరుశనగ: ₹ 1.23
- అపరాలు(మినుము, పెసర, కంది): ₹ 1.62

### ఒక ఎకరం వరికి వాడే నీటితో మీరు సాగు చెయ్యొచ్చు

- అపరాలు 4 ఎకరాలు
- మొక్కజొన్న 2 ఎకరాలు
- చిరుధాన్యాలు: 4 ఎకరాలు
- వేరుశనగ: 1.7 ఎకరాలు
- కూరగాయలు: 2 ఎకరాలు
- పండ్ల తోటలు(సాధారణ): 5 ఎకరాలు
- పండ్ల తోటలు(బిందు): 10 ఎకరాలు

**మరింత సమాచారం కోసం 155251 కు కాల్ చెయ్యండి లేదా మీ దగ్గర లో వున్న RBK ను సంప్రదించండి.**




# డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా

వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ, మత్స్యకార మరియు పట్టు పరిశ్రమ రైతుల సచిత్ర మాస పత్రిక


## విషయసూచిక


సంపాదకీయం

1. వ్యవసాయ రంగానికి రూ. 1,48,500 కోట్ల రుణాల లక్ష్యం 5
2. ఇది రైతు మేలు కోరే ప్రభుత్వం 6
3. అందుబాటులో సమగ్ర వ్యవసాయ ప్రయోగశాలలు 8
4. ఖరీఫ్ సాగు.. మరింత బాగు 9
5. ముమ్మరంగా వరి విత్తనాల పంపిణీ 10
6. కౌలు రైతులకు సాగుపత్రం 12
7. ఆక్వాకు కొత్త కవచాలు 13
8. పనితీరుకు ప్రామాణికం - వై.ఎస్.ఆర్. యాప్ 13
9. ఆన్‌లైన్ పద్ధతిలో విత్తన ధృవీకరణ ప్రక్రియ 15
10. వివిధ పంటల్లో విత్తన శుద్ధి - ప్రాముఖ్యత 16
11. విత్తన శుద్ధి - పద్ధతులు 18
12. వరిలో అధిక దిగుబడికి ఉత్తమ యాజమాన్య పద్ధతులు 19
13. రైతు సేవలో ఏడాది 21
14. వేడుకగా రైతు దినోత్సవం 22
15. రైతు సేవలో ఏడాది 24
16. తొలకరిలో అపరాల సాగు 25
17. కంద సాగులో మెలకువలు 26
18. ఖరీఫ్ రాగి సాగుకు అనుకూలమైన రకాలు మరియు అధిక దిగుబడికి సూచనలు 28
19. ఆకు కూరల సాగు - లాభాలు బాగు 30
20. డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఫోన్-ఇన్ కార్యక్రమం 32
21. పిడుగుల నుండి రక్షణ ఎలా...? 34
22. టూకీగా... 35
23. సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు 37
24. సందేహాలు - సమాధానాలు 39
25. సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు 41
26. సమీకృత రైతు సమాచార కేంద్రంపై రైతుల స్పందన 42





ప్రధాన సంపాదకులు
**శ్రీ హెచ్. అరుణ్‌కుమార్,** ఐ.ఏ.ఎస్.
వ్యవసాయ కమీషనర్



సంపాదకులు
**శ్రీమతి డి. ప్రమీల**
డైరెక్టర్, ఆత్మ

కార్యనిర్వాహక సంపాదకులు
**శ్రీ. వి. హరగోపాలరాజు**

సహాయ సంపాదకులు
**శ్రీ ఎన్.సి.హెచ్. బాలు నాయక్,** డిడిఎ
**డా॥ బి.ఎస్. శ్రీనివాసాచార్యులు,** డిడిఎ ఇన్‌ఛార్జ్
**శ్రీ జె. వెంకటరావు,** ఏడిఎ
**శ్రీ కె. ఆంజనేయ కుమార్,** ఏఒ

*రచనలు పంపాల్సిన చిరునామా :*
వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం
చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు
E-mail : mediaproductionap@gmail.com

డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా సచిత్ర మాసపత్రిక సంవత్సర చందా - రూ.300/-
పంపాల్సిన చిరునామా : ది ఎడిటర్, వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం
చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు




సంపాదకీయం

# పొలం బడి... అధిక దిగుబడులకు ఒరవడి..

కోటి ఆశలతో ఖరీఫ్ సేద్య పనుల్లో స్వేదం చిందిస్తున్న రైతులందరికీ శుభాభినందనలు. ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అరకోటిపైగా రైతు కుటుంబాలకు పెట్టుబడి భరోసా కింద రూ. 3,928 కోట్ల సాయం పంపిణీ చేసి రైతులకు పెట్టుబడి ఖర్చులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసిన సంగతి తెలిసిందే. అలాగే 15 లక్షల మంది రైతులకు పంటల బీమా లబ్ధి చేకూర్చింది.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10,778 రైతు భరోసా కేంద్రాల ద్వారా వరి, వేరుశనగ విత్తనాలు రాయితీకి పంపిణీ చేసి, రైతులు విత్తనాలకు వెతుక్కునే అవసరం లేకుండా ఈ ఆర్బీకేల్లోనే ఖరీఫ్‌కు కావలసిన ఎరువులను కూడా సిద్ధం చేసి పెట్టింది.

ఇప్పుడిక పొలంబడుల ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంట ఉత్పత్తుల దిగుబడుల సాధనలపై బృహత్తర కార్యాచరణకు దిగింది. దీనిప్రకారం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో వ్యవసాయశాఖ యంత్రాంగం ఖరీఫ్ పంట కాలం మొత్తం రైతులకు అండగా నిలవనుంది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడం, హానికరమైన రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి నాణ్యమైన పంట ఉత్పత్తులు పొందేలా చేయడం ఈ పొలంబడుల లక్ష్యం.

సాధారణ, సంప్రదాయ పంటలే కాకుండా ఈసారి తృణ ధాన్యాలు, చిరుధాన్యాల పంటలు సాగు చేసే రైతులకు కూడా శాస్త్ర, సాంకేతిక సహకారాన్ని ఈ పొలంబడుల ద్వారా అందించాలని వ్యవసాయ శాఖ యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వర్యులు ఆదేశించారు. ఇందుకనుగుణంగా వ్యవసాయ శాఖ నిపుణులు, శాస్త్రవేత్తలు, సిబ్బందితో విస్తృత కార్యాచరణతో రైతులకు అండగా నిలిచేందుకు యంత్రాంగం పంటచేలలోకి దిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 8,064 పొలంబడులు నిర్వహించాలని లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

తక్కువ పెట్టుబడి, నాణ్యమైన దిగుబడి, సహజసిద్ధ వనరులతో సాగు, భూసార పరీక్షను బట్టి ఎరువుల వాడకం, వానపాములు, సేంద్రీయ ఎరువుల వాడకానికి అధిక ప్రాధాన్యం, విత్తనశుద్ధితో చీడపీడల నివారణ, అంతర పంటలతో మిత్ర పురుగుల ఉనికి గుర్తింపు, వేప గింజల కషాయంతో శత్రు పురుగుల నివారణ, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి, పర్యావరణ పరిరక్షణ అన్న పది సూత్రాల ఆధారంగా పొలంబడుల్లో రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తారు.

ఈ అంశాలు రైతులకు తెలియక కాదు. మూసధోరణి, అనుకరణ, అవగాహన లేమి వల్ల పంట ఖర్చులు పెంచుకుని నాణ్యమైన దిగుబడులు పొందలేకపోతున్నారు.

ప్రతి రైతు ఆరోగ్యవంతమైన పైరును పెంచి మిత్ర పురుగులను సంరక్షించి, ప్రతివారం చేనును పరిశీలించి తానే ఒక శాస్త్రవేత్తగా, తన నిర్ణయాధికారం అమలు చేసిన నాడు రైతే రాజవుతాడు. ఇందుకు పొలంబడులు అండగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

# వ్యవసాయ రంగానికి రూ. 1,48,500 కోట్ల రుణాల లక్ష్యం




రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు బ్యాంకులు సహాయ సహకారాలు అందించాలని ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గారు విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులకు ఇతోధికంగా రుణాల మంజూరుపై దృష్టి సారించాలని బ్యాంకర్లకు ఆయన సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు మంజూరు పెరగాల్సి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి గారి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ 215వ సమావేశం జూన్ 15న జరిగింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 2,89,380 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను ముఖ్యమంత్రి గారు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఇందులో వ్యవసాయ రంగానికి రు. 1,48,500 కోట్ల మేర రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ధారించారు. వ్యవసాయశాఖామంత్రి శ్రీ కురసాల కన్నబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీమతి పూనం మాలకొండయ్య, వ్యవసాయ శాఖ కమీషనర్ శ్రీ హెచ్. అరుణ్‌కుమార్, నాబార్డు సీ.జీ.ఎం. శ్రీ సుధీర్ కుమార్ జొన్నావర్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆర్.బి.ఐ. శ్రీ జీ.ఎం. యశోదాబాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ముఖ్యమంత్రి గారి ప్రసంగంలో ముఖ్యాంశాలు :

**వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు :** అన్నదాతలకు సొంత ఊరిలోనే విత్తనాల నుంచి విక్రయాల దాకా అన్ని సేవలు అందించేందుకు గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాలు తీసుకొచ్చాం. దాదాపు 10 వేలకు పైగా ఆర్.బి.కే. లు ఏర్పాటు చేశాం. ప్రతి రెండు వేల జనాభాకు ఒక ఆర్బీకేను పెట్టాం. నాణ్యమైన ధృవీకరించిన విత్తనాల దగ్గర నుంచి పండించిన పంటను అమ్మేంత వరకు చేదోడు వాదోడుగా ఆర్బీకేలు నిలుస్తాయి.

**మౌలిక సదుపాయాలు :** వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలు మెరుగు పరుస్తున్నాం. ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెరుగు పర్చేందుకు గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీలు సహా అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నాం. పార్లమెంటు నియోజకవర్గ స్థాయిలో సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాం.

**కౌలు రైతులకు రుణ సదుపాయం :** కౌలు రైతులకు రుణ సదుపాయాలపై కూడా దృష్టి పెట్టాలని బ్యాంకులను కోరుతున్నా. వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. గ్రామాల స్థాయిలో ఆర్బీకేలున్నాయి. ఇ-క్రాపింగ్ కూడా గ్రామ సచివాలయాల స్థాయిలోనే చేస్తున్నారు. ప్రతి కార్యక్రమం పారదర్శకంగా చేస్తున్నాం. వీటిని దృష్టిలో ఉంచుకుని కౌలు రైతులకు రుణాలపై బ్యాంకులు మరింత దృష్టి సారించాలని కోరుతున్నా.

**లక్ష్యాన్ని మించి రుణాలు :** 2020-21 సంllలో వ్యవసాయ రంగ రుణ వితరణ 114.16 శాతంగా ఉంది. రు. 1,28,660 కోట్ల మేర రుణాలు అనుకున్న లక్ష్యాన్ని దాటి 101.8 శాతం మంజూరు. 2021-22 సంllలో వ్యవసాయ రంగ రుణాల లక్ష్యం రు. 1,48,500 కోట్లు.

**బ్యాంకులపై ఒత్తిడి తగ్గింది :** ముఖ్యమంత్రి శ్రీ జగన్‌మోహన్ రెడ్డి గారు బ్యాంకింగ్ రంగానికి మంచి వాతావరణం సృష్టించారని ఎస్.ఎల్.బి.సి. కన్వీనర్ శ్రీ బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. రైతు భరోసాతో పాటు సకాలంలో బీమా పరిహారం రైతులకు అందుతోందన్నారు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# ఇది రైతు మేలు కోరే ప్రభుత్వం

కోవిడ్ కారణంగా ఏడాదిన్నర కాలంలో రాష్ట్రమంతా అతలాకుతలమైనా, ఆదాయం పెను సవాలుగా మారినా రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న కష్టాలతో పోలిస్తే రైతులు, అక్క చెల్లెమ్మలు, పేదల కష్టమే ఎక్కువ అని భావించి ఎక్కడా రాజీ పడకుండా పనిచేశాం. రైతుల కోసం ఇంతగా మనసు పెట్టి ఆలోచన చేసిన సందర్భం ఎప్పుడూ, ఎక్కడా లేదు. 3,648 కిలోమీటర్ల నా పాదయాత్రలో రైతన్నల కష్టాలు చూశాను, విన్నాను, నేను ఉన్నాను అంటూ మాట ఇచ్చాను. ఆ మేరకు ఈ రెండేళ్ళలో చేసి చూపించగలిగాను. ఎన్నికల ప్రణాళికలో చెప్పినవన్నీ చేస్తూ వస్తున్నామని ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారు అన్నారు. దివంగత ముఖ్యమంత్రి, మహానేత శ్రీ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి జయంతిని (జూలై 8) రైతు దినోత్సవంగా జరుపుకొంటున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి రైతు దినోత్సవ వేడుకలు అనంతపురం జిల్లా రాయదుర్గంలో జరిగాయి. ఆ వేడుకల్లో ముఖ్యమంత్రి వర్యులు ప్రసంగించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లో...

**రైతు విప్లవానికి నాంది పలికిన నేత వైఎస్సార్ :** దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జీవించినంతకాలం రైతుల గురించి ఆలోచించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని మనసా, వాచా, కర్మణా కోరుకున్నారు. ఈ రోజు ఆయన జయంతిని రైతు దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉంది. ఆ రోజుల్లో ఆయన ఉచిత విద్యుత్తు ఇవ్వాలని అంటే, నాన్నగారికి ముందున్న పాలకులు కరెంటు తీగలు చూపించి బట్టలు ఆరేసుకోవడానికి ఉపయోగపడతాయని అపహాస్యం చేశారు. అయితే వైఎస్సార్ ముఖ్యమంత్రి కాగానే ఉచిత విద్యుత్తు ఫైలుపై తొలి సంతకం చేసి రాష్ట్రంలో రైతు విప్లవానికి నాంది పలికారు.

ఇన్‌పుట్ సబ్సిడీ పెంపు, విత్తనాల ధరల తగ్గింపు, ఒక సంతకంతో బకాయిలు రద్దు ఇలా రైతుల కోసం ఎన్నో చేశారు. జలయజ్ఞం రూపురేఖలు మార్చారు. ముఖ్యంగా అనంతపురం జిల్లా రూపురేఖలు మార్చేసిన నేత వైఎస్ రాజశేఖరరెడ్డి గారు అని గుర్తు చేస్తున్నాను.

**అదే స్ఫూర్తితో ముందుకు అడుగులు :** దివంగత మహానేతను స్ఫూర్తిగా తీసుకుని ఈ రెండేళ్ళు మన పరిపాలన కూడా రైతు పక్షపాత ప్రభుత్వంగా సాగిందని సగర్వంగా పేర్కొంటున్నాను. అందుకే ఈ రెండేళ్ళలో రైతుల కోసం రూ. 83 వేల కోట్లు ఖర్చు చేశాం. ఈ ఒక్కరోజు రైతన్నల కోసం, ఏకంగా రూ. 1,570 కోట్లతో శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశాం. ఎన్నికల ప్రణాళికలో రైతుల బాగోగుల కోసం పనిచేస్తామని చెప్పాము. చెప్పినట్లుగా అన్ని చేసుకుంటూ వచ్చాము. పంట వేసే



"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"




సమయంలో రైతన్నకు పెట్టుబడి ఖర్చుల వల్ల, పండించిన పంటను అమ్ముకోలేని పరిస్థితుల నేపథ్యంలో కష్టాలు వస్తాయి.

పంట వేసిన తరువాత కరువు వలన, వర్షాల వలన పంట దెబ్బతిన్నప్పుడు రైతు తల్లడిల్లిపోతున్న పరిస్థితి నా కళ్లారా చూశాను. వారి కష్టాలు తీర్చడంలో భాగంగా పెట్టుబడి సహాయంగా ఎప్పుడూ, ఎక్కడా జరగని విధంగా రైతు భరోసా పథకం కింద రూ. 13,500 చొప్పున మూడు విడతలుగా అందజేస్తున్నాం. దీనివల్ల దాదాపు 70 శాతం మంది రైతులకు పెట్టుబడి ఖర్చు ఇచ్చినట్లవుతుంది. ఈ రెండేళ్ళలో 52.38 లక్షల మంది రైతులకు రూ. 17,029 కోట్లు ఇచ్చాం.

**ప్రతి అడుగులోనూ తోడుగా ఆర్బీకేలు :** రైతుల కోసం, ఆలోచించాం కాబట్టి ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా 10,778 ఆర్బీకేలు ఏర్పాటు చేశాం. విత్తనం నుంచి అమ్మకం వరకూ ప్రతి స్థాయిలోనూ రైతు చేయి పట్టుకుని సహాయ సహకారాలు అందిస్తూ తోడుగా ఉంటున్నాము.

ఆర్బీకేల ద్వారా రైతులకు ఎంతో మంచి జరుగుతోంది. నాణ్యతతో కూడిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను 48 గంటల్లో అందించే పరిస్థితి ఉంది. ఇదే అనంతపురం జిల్లాలో 2.33 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనం ఎవరికీ కష్టం లేకుండా సులభంగా పంపిణీ చేయగలిగాము. ఆర్బీకేల ద్వారా ఈ క్రాపింగ్ చేస్తున్నాం. ప్రతి పంట నమోదు అవుతుంది. ఈ ఏడాది నుంచి భౌతికంగా రసీదులు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టాం. ఈ క్రాపింగ్ జరిగిన వెంటనే పంటల బీమా, వడ్డీ లేని రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ చివరకు పంటల కొనుగోలు కూడా ఆర్బీకేల ద్వారా జరుగుతోంది.

ప్రతి ఊళ్ళో క్రాప్ ఇన్సూరెన్స్ చేస్తున్నాం. ఖరీఫ్‌లో నష్టం జరిగితే తరువాత ఖరీఫ్ కల్లా పరిహారం అందుతుంది. ఏ సీజన్‌లో నష్టం జరుగుతుందో సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీని ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిదే. గతంలో యూనిట్ రూ.3.84 ఉన్న కరెంటు రేటును రూ.1.50 లకే ఇచ్చి ఆక్వా రైతులకు కూడా అండగా నిలిచాం.

**మండల, జిల్లా స్థాయిలో వ్యవసాయ సలహా మండళ్ళు :** పంట ప్రణాళికపై సూచనలు, సలహాలు ఇస్తున్నాయి. ఆర్బీకేల స్థాయిలో తక్కువ అద్దెకే యంత్ర సేవా సంస్థల ద్వారా యంత్ర పరికరాలు అందజేస్తున్నాం. రైతన్నలు తమ పంట అమ్ముకోలేనప్పుడు ఆర్బీకేలను సంప్రదించవచ్చు. లేదంటే సీఎం యాప్ ద్వారా సమాచారం పంపినా ఆర్బీకేల ద్వారా కనీస మద్దతు ధరకు ఆ పంటను కొనుగోలు చేస్తారు.

ఈ రెండేళ్ళలో రూ.6600 కోట్లకు పైగా (ధాన్యం, పత్తి కొనుగోళ్ళు కాకుండా) ఖర్చు పెట్టాం. కంది, చీనీ, వేరుశనగ చివరకు పొగాకు కూడా కొనుగోలు చేసి రైతుకు తోడుగా నిలిచాం అని ముఖ్యమంత్రి వర్యులు పేర్కొన్నారు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056028 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# అందుబాటులో సమగ్ర వ్యవసాయ ప్రయోగశాలలు



నాణ్యమైన విత్తనం మేలైన దిగుబడికి నాంది. నిఖార్సయిన ఎరువు, పురుగు మందు పరిపుష్టమైన పైరుకు తోడ్పడుతుంది, తెగులును సమర్ధవంతంగా నివారిస్తుంది. రైతుకు అతి ముఖ్యమైన ఈ మూడు అందుబాటులో ఉండాలంటే వీటిని నిర్ధారించే ప్రయోగ శాలలు కావాలి. అత్యంత ముఖ్యమైన ఈ అవసరాన్ని గుర్తించిన ముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గారు సమగ్ర వ్యవసాయ ప్రయోగశాలల ఏర్పాటుకు సంకల్పించారు. అవికూడా దేశంలోనే తొలిసారి రాష్ట్రంలో అత్యధిక మంది రైతులకు చేరువలో సత్వరం ఫలితాలు అందించేలా 162 ప్రయోగశాలలు ఏర్పాటవబోతున్నాయి. అంటే రాష్ట్రంలో మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా 15 పట్టణ ప్రాంతాలను మినహాయించి 147 ఏర్పాటవుతాయి. వీటికి అదనంగా 13 జిల్లా స్థాయిలో ఉంటాయి.

ఈ సమగ్ర ప్రయోగశాలలకు దేశంలోని ప్రఖ్యాత శిక్షణ, పరిశోధన సంస్థలు సహాయ సహకారాలు అందించనున్నాయి. ఎన్ఐపీహెచ్ఎం (హైదరాబాదు), ఎన్ఎస్ఆర్టీసీ (వారణాసి), ఆర్ఎఫ్‌సీఎల్ (నవీముంబయి), సీఐఎల్ (ఫరీదాబాద్), ఆంగ్రూ, లాం, ఐఏఆర్ఐ, వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కూడా చేసుకున్నాయి. పరీక్ష పరికరాలు కొనుగోలు చేసి, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ఇందుకు అవసరమైన రూ.213.27 కోట్లను నాబార్డు రుణంగా అందించింది.

**ఏం చేస్తారు :** ఈ ప్రయోగశాలల్లో విత్తన నాణ్యత పరీక్షలు, తేమ మొలకశాతం, బాహ్య స్వచ్ఛత పరీక్షలు, నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్, ఇనుము, బోరాన్, క్యాల్షియం, మెగ్నీషియం పోషకాల నాణ్యత పరీక్షించనున్నారు. పురుగు మందుల నాణ్యతను జిల్లా స్థాయిలోనే పరీక్షిస్తారు. రైతులు తెచ్చిన శాంపిళ్లను పరీక్షించడమే గాక, చట్టపరమైన అంశాలను అనుసరించి నాణ్యతా ప్రమాణాలు సరిగా లేని వాటిని జిల్లా స్థాయిలో మళ్లీ పరీక్షకు పంపిస్తాయి. ఏడీఏలు ఈ ప్రయోగశాల లకు బాధ్యులుగాను, మండల వ్యవసాయాధికారి ఎనలిస్ట్‌గాను వ్యవహరిస్తారు.

ఈ ప్రయోగశాలల్లో మొదటి విడతగా 68 కేంద్రాలను జులై 8న రైతు దినోత్సవం సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు ప్రారంభించారు. మిగిలిన 79 ని రెండోదశలో ప్రారంభిస్తారు.

జిల్లా స్థాయి డా. వై.ఎస్.ఆర్. ప్రయోగశాలల్లో మార్కెట్ లోకి విడుదలయ్యే ముందు వ్యవసాయ ఉత్పాదనలను పరిశీలిస్తారు. అంతేకాకుండా విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, తిరుపతిల్లో నాలుగు ప్రాంతీయ కోడింగ్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. ప్రతి కోడింగ్ సెంటర్ విత్తన, ఎరువు, పురుగు మందుల శాంపిళ్లను స్వీకరిస్తాయి. వీటిని కోడ్ చేసి వాటిని పరీక్ష కేంద్రాలకు పంపడం ప్రాంతీయ కోడింగ్ సెంటర్ల పాత్ర.

# ఖరీఫ్ సాగు.. మరింత బాగు

- ఖరీఫ్-21 ఉత్పత్తి లక్ష్యాన్ని ప్రకటించిన వ్యవసాయ శాఖ
- ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యం 94.01 లక్షల టన్నులు
- వరి దిగుబడి అంచనా 85.16 లక్షల టన్నులు
- గత ఖరీఫ్‌తో పోలిస్తే ఆహార ధాన్యాల ఉత్పత్తి 7.23 లక్షల టన్నులు అదనంగా లభిస్తుందని అంచనా

ఖరీఫ్ - 2021 పంటల ఉత్పత్తి లక్ష్యాన్ని వ్యవసాయ శాఖ ప్రకటించింది. గడచిన ఖరీఫ్ సీజన్‌లో 90.86 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా... ఈ ఖరీఫ్‌లో 94.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. తద్వారా 94.01 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అవుతాయని అంచనా వేసింది. గత ఖరీఫ్‌తో పోలిస్తే.. ఈ ఖరీఫ్‌లో 3.34 లక్షల ఎకరాలను అదనంగా సాగులోకి తీసుకురావడం ద్వారా 7.23 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను అదనంగా పొందాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఖరీఫ్-2021 సాగు లక్ష్యానికి అనుగుణంగా దిగుబడి అంచనాలను వ్యవసాయ శాఖ ప్రకటించింది. మొత్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 94.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేయించాలని నిర్ణయించగా అందులో వరి విస్తీర్ణం అత్యధికంగా 39.50 లక్షల ఎకరాలుగా ఉంది. 5.21 లక్షల ఎకరాల్లో తృణధాన్యాలు, 8.97 లక్షల ఎకరాల్లో అపరాలు కలిపి మొత్తం ఆహార ధాన్యాలు 53.68 లక్షల ఎకరాల్లో సాగు చేయించాలని వ్యవసాయ శాఖ నిర్దేశించింది. 19.72 లక్షల ఎకరాల్లో నూనె గింజలు, 14.81 లక్షల ఎకరాల్లో పత్తి, 3.69 లక్షల ఎకరాల్లో మిరప, లక్ష ఎకరాల్లో చెరకు, మరో 1.31 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేయించాలని లక్ష్యంగా నిర్ణయించింది.

## గతం కంటే ఘనంగా...

గత ప్రభుత్వ హయాంలో సగటున ఏటా ఖరీఫ్ సీజన్‌లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 80.51 లక్షల టన్నులు కాగా, అందులో 73.86 లక్షల టన్నుల వరి దిగుబడి ఉంది. ఖరీఫ్-2019 లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 87.77 లక్షల టన్నులు కాగా, అందులో వరి దిగుబడి 80.13 లక్షల టన్నులు. ఖరీఫ్-2020లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 86.78 లక్షల టన్నులు కాగా, ఇందులో వరి దిగుబడి 78.89 లక్షల టన్నులు.

## పెరగనున్న దిగుబడులు

ఈ ఖరీఫ్‌లో 39.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయించాలని లక్ష్యంగా నిర్దేశించగా... ఎకరాకు 2.156 కేజీల చొప్పున 85.16 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. తృణధాన్యాల దిగుబడి 6.74 లక్షల టన్నులు. అపరాల దిగుబడి 2.11 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని లెక్క వేశారు. ఈ విధంగా 53.68 లక్షల ఎకరాల్లో ఆహార ధాన్యాల దిగుబడి 94.01 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ఆయిల్ సీడ్స్ 8.34 లక్షల టన్నులు. చెరకు 29.70 లక్షల టన్నులు, పత్తి 10.43 లక్షల టన్నులు, మిరప 8.48 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని లెక్కలేశారు. ఈ ఖరీఫ్-21 సీజన్‌లో మొత్తంగా 94.20 లక్షల ఎకరాల్లో ఆహార ధాన్యాలతో పాటు అన్ని రకాల పంటల ద్వారా 154.50 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

## రెండేళ్ళ కంటే మిన్నగా దిగుబడులు

గడచిన రెండేళ్ళ కంటేమిన్నగా ఈ ఖరీఫ్‌లో దిగుబడులు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఆహార ధాన్యాలు ఖరీఫ్-2019లో 87.77 లక్షల టన్నులు, ఖరీఫ్-2020లో 86.78 లక్షల టన్నుల దిగుబడులు రాగా, ఈ ఖరీఫ్‌లో 94.01 లక్షల టన్నుల దిగుబడులొస్తాయని అంచనా వేశాం. గత ఖరీఫ్‌లో 78.89 లక్షల టన్నుల వరి దిగుబడి రాగా, ఈ ఖరీఫ్‌లో 85.16 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం.

-హెచ్. అరుణ్‌కుమార్, కమీషనర్, వ్యవసాయశాఖ



"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# ముమ్మరంగా వరి విత్తనాల పంపిణీ




ఖరీఫ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరంగా రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా 13 రకాల వరి విత్తనాలు పంపిణీ చేస్తోంది. గతేడాది రాష్ట్రంలో 39.54 లక్షల ఎకరాల్లో వరి సాగవగా, ఈ ఏడాది 41.20 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకోసం ఏ.పి. విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా సర్టిఫై చేసిన 2.37 లక్షల క్వింటాళ్ళ రాయితీ విత్తనాన్ని సిద్ధం చేసింది. జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్.ఎఫ్.ఎస్.ఎం.) పరిధిలోని విజయనగరం,




విశాఖపట్నం, శ్రీకాకుళం, వైఎస్సార్ జిల్లాల్లో కిలో రూ. 10/-, మిగిలిన జిల్లాల్లో రూ. 5/-లు చొప్పున రాయితీపై పంపిణీ చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో మాత్రం 90 శాతం రాయితీపై ఇస్తున్నారు.

**ఆర్‌బీకేల్లో టెస్టింగ్ కిట్‌లు :** ఆర్‌బీకేల ద్వారా వాస్తవ సాగుదారులకు మాత్రమే వరి వంగడాలు పంపిణీ చేస్తున్నారు. విత్తన నాణ్యతను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వి.ఏ.ఏ.), మండల వ్యవసాయాధికారి (ఎం.ఏ.ఓ.), వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏ.డీ.ఏ.) పరిరక్షిస్తున్నారు. ఇందుకోసం ప్రతి ఆర్‌బీకే వద్ద సీడ్ టెస్టింగ్ కిట్‌లు అందుబాటులో ఉంచారు. జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు పంపిణీ తీరును పర్యవేక్షిస్తున్నాయి. సబ్సిడీ విత్తనంతో నాటిన పంటను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఏ గ్రామంలో ఏ రైతుకు ఏ రకం వంగడం ఎంత సరఫరా చేశారో ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తున్నారు.

ఏళ్ల తరబడి సాగు చేస్తున్న కొన్ని రకాల వంగడాలు తెగుళ్లను తట్టుకోలేకపోవడం, గింజలపై మచ్చలు ఏర్పడడం, మిల్లింగ్‌లో ముక్కలైపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నాయి. దాంతో రైతులకు పూర్తి మద్దతు ధర లభించడంలేదు. ఈ నేపథ్యంలో వీటి సాగు పూర్తిగా ఆపేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.




"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# రాయితీ వరి విత్తనం

## ఖరీఫ్ - 2021 కోసం వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తున్న ప్రధాన వరి విత్తనాలు...

| విత్తనం | సిద్ధం చేసిన విత్తనం క్వింటాళ్లలో) | అమ్మకం ధర (క్వింటాల్‌కి) | నాన్ ఎస్.ఎఫ్.ఎం.ఎస్. జిల్లాల్లో క్వింటాల్ ధర (సబ్సిడీ రూ.500) | ఎస్.ఎఫ్.ఎం.ఎస్. జిల్లాల్లో క్వింటాల్ ధర (సబ్సిడీ రూ.1000) |
|---|---|---|---|---|
| బీపీటీ - 3291 (సోనా మసూరి) | 17,256 | 3,758 | 3,2,58 | 2,758 |
| బీపీటీ - 5204 (సాంబ మసూరి) | 38,349 | 3,810 | 3,310 | 2,810 |
| ఎంటీయూ-1061 (ఇందిర) | 18,343 | 3,817 | 3,317 | 2,817 |
| ఎంటీయూ-1064 (అమర) | 17,654 | 3,817 | 3,317 | 2,817 |
| ఎంటీయూ - 1121 (శ్రీధృతి) | 58,953 | 3,781 | 3,281 | 2,781 |
| ఎంటీయూ - 1210 (సుజాత) | 416 | 3,781 | 3,281 | 2,781 |
| ఎంటీయూ - 7029 (స్వర్ణ) | 35,560 | 3,817 | 3,317 | 2,817 |
| ఎన్ఎల్ఆర్ - 33892 | 1,715 | 3,400 | 2,900 | 2,400 |
| ఎన్ఎల్ఆర్ - 34449 | 11,766 | 3,300 | 2,800 | 2,300 |
| ఎన్ఎల్ఆర్ - 4001 | 20 | 3,781 | 3,281 | 2,781 |
| ఆర్‌జీఎల్ - 2537 | 29,558 | 3,784 | 3,284 | 2,784 |
| ఆర్ఎన్ఆర్ - 15048 | 101 | 3,684 | 3,184 | 2,684 |
| ఎంటీయూ × 1224 | 2,302 | 3,758 | 3,258 | 2,758 |

## ఖరీఫ్ సీజన్‌లో ప్రోత్సహించకూడదని నిర్ణయించిన వరి వంగడాలివే

| **జిల్లా** | **వంగడాలు** |
|---|---|
| శ్రీకాకుళం | ఎంటీయూ - 1010, 1001, 1075, 1156 |
| విజయనగరం | ఎంటీయూ - 1156, 1153, 1075 |
| విశాఖపట్నం | ఎంటీయూ - 1156, 1075 |
| తూ.గోదావరి | ఎంటీయూ - 3626, 1010, 1001, 1153, 1156 |
| ప.గోదావరి | ఎంటీయూ - 1156, 1153, 1252 |
| కృష్ణా | ఎంటీయూ - 1075, 1153, 1156 |
| గుంటూరు | జేజీఎల్ - 386 |
| ప్రకాశం | ఎన్ఎల్ఆర్ - 145 |
| నెల్లూరు | ఎంటీయూ - 1010, 1001, 1156, ఏడీటీ-37 |
| వైఎస్సార్ | ఎంటీయూ - 1010 |
| కర్నూలు | ఎంటీయూ - 1001 |
| అనంతపురం | విఆర్ - 64, ఎంటీయూ-1010 |
| చిత్తూరు | ఏడీటీ - 37 (బుడ్డాలు) |

### 13 రకాల వంగడాలు..

ఖరీఫ్ - 2021 సీజన్‌లో 13 రకాల వంగడాలను ప్రోత్సహించాలని నిర్ణయించాం. వాతావరణాన్ని తట్టుకోలేని, నూక శాతం ఎక్కువగా ఉన్న మార్కెట్‌లో డిమాండ్ లేని వంగడాలను ఈ సీజన్‌లో ఆపేయాలని నిర్ణయించాం. వీటి స్థానంలో ప్రత్యామ్నాయ వంగడాల సాగును ప్రోత్సహించేలా రైతులను చైతన్య పరుస్తున్నాం. రాయితీ విత్తనం కోసం రైతులు డి.కృషి యాప్ ద్వారా ఆర్బీకేల్లో వివరాలను నమోదు చేసుకుంటున్నారు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."



# కౌలు రైతులకు సాగుపత్రం




భూ యజమానులకు నష్టం వాటిల్లకుండా కౌలు రైతులకు (వాస్తవ సాగుదారులు) పంట సాగుదారు హక్కు పత్రాల (సీసీఆర్‌సీ)ను జారీ చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) వద్ద సీసీఆర్‌సీ మేళాలను నిర్వహిస్తోంది. పంట సాగుదారు హక్కు పత్రాల (సీసీఆర్‌సీ) చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత గడచిన రెండేళ్లలో 6,87,474 మందికి సీసీఆర్‌సీలు జారీ చేయగా, 2021-22 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి కొత్తగా మరో 5 లక్షల మందికి వాటిని జారీ చేయాలని నిర్ణయించింది. వీరందరికీ నిబంధనల ప్రకారం రైతు భరోసా, రాయితీపై విత్తనాలు, పంట రుణాలు, సున్నా వడ్డీ రాయితీ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా, కనీస మద్దతు ధర వంటి ప్రయోజనాలను వర్తింప చేయనుంది.

## ప్రయోజనాలెన్నో...

రాష్ట్రంలో 76,21,118 మంది రైతులుండగా... వారిలో 16,00,483 మంది కౌలుదారులున్నారు. సాగు భూమిలో 70 శాతానికి పైగా వీరు కౌలుకు చేస్తుంటారని అంచనా. గతంలో వీరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందని ద్రాక్షగా ఉండేవి. ఆగష్టు 2019లో అమల్లోకి వచ్చిన పంట సాగుదారు హక్కు పత్రాల (సీసీఆర్‌సీ) చట్టం కౌలు రైతులకు రక్షణగా నిలిచింది. ఈ చట్టం కింద 11 నెలల కాల పరిమితితో జారీ చేస్తున్న కౌలు హక్కు పత్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు రాయితీపై పొందడంతోపాటు తాము పండించిన పంటను కనీస మద్దతు ధరకు అమ్ముకునే వెసులుబాటు కలుగుతుంది. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ. 13,500 పెట్టుబడి సాయం అందుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్నివర్గాల కౌలు రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పంట రుణాలు, సున్నా వడ్డీ రాయితీ, పంట నష్టపరిహారం, ఉచిత పంటల బీమా వంటి అన్ని పథకాల లబ్ధిని పొందే వెసులుబాటు కల్పించింది. భూ యజమానుల అంగీకారంతో ఇప్పటివరకు సీసీఆర్‌సీలు పొందిన కౌలు రైతులు తమ పత్రాలను రెన్యువల్ చేసుకోవడంతో పాటు మరో 5 లక్షల మందికి కొత్తగా సీసీఆర్‌సీలు జారీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకోసం మేళాలు నిర్వహిస్తోంది. మేళాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలుదారులకు సీసీఆర్సీలు జారీచేసి... వాటిని వైఎస్సార్ రైతు భరోసా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించడం ద్వారా వారికి ఈ ఏడాదికి సంబంధించి తొలి విడత వైఎస్సార్ రైతు భరోసా సాయం అందించాలని సంకల్పించింది. సాధ్యమైనంత ఎక్కువ మందికి భరోసా చేకూరనుంది.

## భూ యజమానులు నిర్భయంగా ముందుకు రావచ్చు..

సీసీఆర్‌సీ పత్రాలపై సంతకం చేసే విషయంలో భూ యజమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు. 11 నెలల కాలంలో పండించిన పంటపై తప్ప... భూమిపై కౌలుదారులకు ఎలాంటి హక్కులు ఉండవు. దీనివల్ల భూ యజమానులు కౌలు రైతులకు రాయితీపై విత్తనాలు, వైఎస్సార్ రైతు భరోసా, పంట రుణాలు, సున్నా వడ్డీ రాయితీ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంట బీమా, కనీస మద్దతు ధర రావడానికి సహకరించినవారవుతారు. సాగుదారులకు సీసీఆర్‌సీలు జారీ విషయంలో భూ యజమానులు నిర్భయంగా ముందుకు రావచ్చు.

–హెచ్. అరుణ్‌కుమార్, కమీషనర్, వ్యవసాయ శాఖ

## జిల్లాల వారీగా సీసీఆర్‌సీల జారీ లక్ష్యం

| జిల్లా | జారీ లక్ష్యం | జూలై 14 నాటికి జారీ చేసిన పత్రాలు |
|---|---|---|
| శ్రీకాకుళం | 20,500 | 6,354 |
| విజయనగరం | 21,000 | 11,818 |
| విశాఖపట్నం | 7,500 | 3,764 |
| తూ.గోదావరి | 85,500 | 1,07,560 |
| ప.గోదావరి | 1,45,500 | 1,12,789 |
| కృష్ణా | 42,000 | 65,037 |
| గుంటూరు | 51,000 | 55,794 |
| ప్రకాశం | 35,000 | 22,535 |
| నెల్లూరు | 40,000 | 12,889 |
| అనంతపురం | 20,500 | 2,316 |
| వైఎస్సార్ | 5,000 | 4,198 |
| చిత్తూరు | 18,000 | 1,805 |

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# ఆక్వాకు కొత్త కవచాలు



ఆక్వా ఉత్పత్తుల వాణిజ్యం, ఎగుమతులకు అనుకూలమైన వాతావరణాన్ని ఈ చట్టం కల్పిస్తుంది. పంటకు అదనపు విలువను జోడించేందుకు పంట పెట్టుబడి సమయంలో అవసరమైన సపోర్టు అందిస్తుంది. ఏపీ ఆక్వాకల్చర్ సడా యాక్టు – 2020 పరిధిలోకి చేపలు, రొయ్యల హేచరీలన్నీ వస్తాయి. అన్ని జాతుల సీడ్ ఉత్పత్తి నాణ్యతను ఈ చట్టం నియంత్రిస్తుంది. హేచరీలకు ప్రత్యేక గర్తింపు (అక్రిడేషన్) ఇస్తారు. సాగుచేసే చేపలు, రొయ్యల జాతుల ఆధారంగా రాష్ట్రంలో సరఫరా చేసే విత్తనానికి సర్టిఫికేషన్ జారీచేస్తారు. థర్డ్ పార్టీల ద్వారా తనిఖీలు నిర్వహిస్తారు. నాణ్యత పాటించని కంపెనీలపై జరిమానాలు విధిస్తారు. చేపల ఫీడ్ తయారీ కంపెనీలు పంపిణీదారులు, డీలర్లను ఏపీ ఫిష్, ఫీడ్ యాక్ట్ – 2020 పరిధిలోకి తీసుకొచ్చారు. బీఐఎస్/ఎఫ్ఏవో ప్రమాణాల మేరకు చేపల ఫీడ్ తయారీని ప్రోత్సహిస్తారు. ఫీడ్ ప్లాంట్స్‌కు గుర్తింపుతో పాటు సర్టిఫికేషన్ చేస్తారు. ఫీడ్, తయారీ కంపెనీల్లో థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా తనిఖీలు చేసి నాణ్యత పాటించని వాటికి జరిమానాలు విధిస్తారు.

రాష్ట్రంలో ఆక్వా రంగ పరిస్థితిని మరింత మెరుగు పరిచేందుకు తీసుకొచ్చిన 3 చట్టాలు జూలై 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చాయి. ఆక్వా రంగం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో తీసుకొచ్చిన ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీ సడా) యాక్టు–2021 ఏపీ ఆక్వాకల్చర్ సీడ్ యాక్టు–2020, ఏపీ ఫిష్ ఫీడ్ యాక్ట్–2020 అమల్లోకి వస్తాయని వ్యవసాయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి పూనం మాలకొండయ్య నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న సాగుదారులైతే ఎలాంటి ఫీజు లేకుండా ఎండార్స్‌మెంట్ చేసుకోవచ్చు. ఈ ఏడాది నుంచి సాగు విస్తరణకు వెళ్ళేవారితో పాటు కొత్తగా సాగు చేసేందుకు ముందుకొచ్చేవారు తగిన రుసుముతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి ఈ రంగంపై ఆధారపడి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు, వ్యక్తులు, వ్యాపారులు పాత లైసెన్సుదారులైనా సరే తగిన రుసుం చెల్లించి ఎండార్స్ మెంట్ చేయించుకోవాలి. కొత్తగా ఈ రంగంలోకి వచ్చే వారు ఈ చట్టం ప్రకారం కొత్త లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుంది.

## ఆక్వా కార్యకలాపాలన్నింటికి రక్షణ

ఆక్వా కల్చర్ కార్యకలాపాలన్నింటినీ ఏపీ సడా యాక్ట్–2020 పరిధిలోకి తీసుకొస్తున్నారు. సీడ్, ఫీడ్, నాణ్యతతో కూడిన ఉత్పత్తి, మార్కెట్ ధరలను ఈ చట్టం నియంత్రిస్తుంది. నాణ్యత లోపిస్తే ఈ చట్టం కింద భారీగా జరిమానాలు విధిస్తారు.

## కొత్తగా లైసెన్సులు తీసుకోవాల్సిందే...

సాగు చేస్తున్న రైతులతో పాటు చేపలు, రొయ్యల సీడ్, ఫీడ్ తయారీ, పంపిణీదారులు, డీలర్లు, రిటైలర్లతోపాటు కోల్డ్‌స్టోరేజ్‌లు, ఐస్‌ప్లాంట్స్, ప్రాసెసింగ్ ప్లాంట్లు, హేచరీలు కన్సల్టెన్సీలు ఇలా ఈ రంగంపై ఆధారపడిన ప్రతి ఒక్కరూ కొత్తగా లైసెన్సులు తీసుకోవాల్సిందే. లైసెన్సులు లేకుండా సాగుచేసినా, వ్యాపార లావాదేవీలు జరిపినా చర్యలు తప్పవు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లాగిన్ ద్వారా దరఖాస్తు చేస్తే మత్స్య సహాయకుని ద్వారా ఎఫ్‌డీవోకి, అక్కడి నుండి జిల్లా మత్స్యశాఖాధికారికి పంపిస్తారు. దరఖాస్తు చేసిన 6 నుంచి 15 రోజుల్లో లైసెన్సులు జారీ చేస్తారు.

**–కె కన్నబాబు,** కమీషనర్, మత్స్యశాఖ

"చీడపీడలపై మీ సందేహాలను 8331056152 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# పనితీరుకు ప్రామాణికం - వై.ఎస్.ఆర్. యాప్

రాష్ట్రంలో రైతులకు విత్తు నుంచి పంట విక్రయం వరకు వెన్నంటి నిలవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రివర్యులు మానసపుత్రికగా ఆవిర్భవించినవి రైతు భరోసా కేంద్రాలు . రాష్ట్రంలో 2000 జనాభాకు ఒకటి వంతున 10 ,778 పైగా రైతుభరోసా కేంద్రాలు ఇప్పటికే రైతుసేవలో నిమగ్నమయ్యాయి.

ఈ కేంద్రాలను వనరుల పరంగా మరింత పరిపుష్టం చేసి పర్యవేక్షణ పెంచి, పారదర్శకంగా సేవలు అందించాలని వ్యవసాయ శాఖ యంత్రాంగాన్ని రైతులకు మరింత చేరువ చెయ్యాలని ముఖ్యమంత్రి వర్యులు నిర్దేశించారు.

గ్రామ స్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులు

మొదలు మండల వ్యవసాయాధికారి, వ్యవసాయశాఖ సహాయ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్లందర్నీ ఇందులో భాగస్వామి చేస్తే తప్ప ఈ లక్ష్యం నెరవేరదు.

ఈ లక్ష్యాల సాధనకు సాంకేతిక సహాయాన్ని తీసుకోవాలన్న ఆలోచనల్లోంచి పుట్టిందే వైఎస్సార్ యాప్ (YSR APP).

వ్యవసాయాధారిత రాష్ట్రంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలి. అది మేలైనదిగా. ఇందుకు వ్యవసాయశాఖ యంత్రాంగం దన్నుగా ఉండాలి. స్థూలంగా ఇది యాప్ ఉద్దేశం.

గత ఏడాది జూన్ 26న ముఖ్యమంత్రి వర్యులు ఆవిష్కరించిన ఈ యాప్ గురించి తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. ముఖ్యాంశాలు మీకోసం.

ముందుగా మనం చెప్పుకున్నట్టు ఈ యాప్‌ను ఎంత సమర్థవంతంగా వినియోగించుకుంటే వీఏఏ, ఎంఏఓ, ఏడీఎల పనితీరు అంతర్ప్రస్ఫుటంగా వెల్లడవుతుంది. మీ పనితీరే మీకు ప్రామాణికం, మార్కులు, ప్రశంసలు, అభినందనలు తెస్తుంది.

ఆర్.బీ.కేల పర్యవేక్షణ ఇలా, ప్రతి రైతుభరోసా కేంద్రానికి రాష్ట్ర , జిల్లా స్థాయి అధికారులు ఒక నిర్దిష్ట కార్యాచరణ ఇస్తారు. అంటే మట్టి నమూనాల సేకరణ, ఈ క్రాప్ బుకింగ్, పొలంబడి, పంటకోత ప్రయోగాలు క్షేత్ర ప్రదర్శనల వంటివన్న మాట. ఇవన్నీ కూడా ఒకరోజు నుంచి వారం, నెల వ్యవధిలో చెయ్యాల్సి ఉంటుంది. ఆర్బీకే సిబ్బంది స్వయంగా కూడా ఇలాంటివి చేసి ఈ యాప్లో నమోదు చెయ్యాలి. ఈ వివరాలు కచ్చితత్వానికి జియోఫెన్స్, GPS ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ఇవన్నీకూడా




ఆర్.బీ.కేకు ఐదు కిలోమీటర్ల పరిధిలోనే ఉండాలి. ఆ పరిధిదాటితే మీరు ఎంతచేసినా అది నిష్ఫలమే. ఈ కార్యాచరణ ఆధారంగా ఆర్.బీ.కేలకు ఎక్సలెన్ట్ , గుడ్, పూర్‌గా ర్యాంకులు ఇస్తారు. ఇందుకు 60 మార్కులు ఉంటాయి. ఆర్.బీ.కేకు వెళ్లినందుకు రోజుకి 2 వంతున 40 మార్కులు ఉంటాయి. ఈ యాప్‌ని ఇంటర్నెట్లో నుంచి కూడా ఆఫ్-లైన్లో ఉపయోగించుకునే వెసులుబాటుంది.

**ఎంఏఓల పనితీరు అంచనా ఇలా :** మండల వ్యవసాయాధారికారులు సమగ్ర వివరాలు ఇందులో పొందుపరిచి ఉన్నాయి. వారు తమ కార్యాలయ పరిధిని ఎంచుకోవడం ద్వారా ఈ యాప్‌లోకి వస్తారు. ఎంఏఓలకు కూడా మార్కులు ఉంటాయి. తమపరిధిలోని ఆర్.బీ.కేలను సందర్శించి అక్కడ గంటసేపు ఉంటే వారికి 40 మార్కులు వస్తాయి. తన మండలంలోని 20 ఆర్.బీ.కేలను ఒక నెలలో సందర్శించి, సలహాలు, సమీక్షలు జరపగలిగితే 40 మార్కులు వస్తాయి. ఆర్.బీ.కేల పనితీరు సగటు ఆధారంగా కూడా మార్కులు కేటాయిస్తారు. ఉదాహరణకు తూర్పుగోదావరి జిల్లా సీతానగరం, విజయనగరం జిల్లా ఎల్. కోట, చిత్తూరు జిల్లా సీజీగల్లు ఎంఏఓలు రోజుకు మూడు ఆర్.బీ.కేల వంతున సందర్శిస్తున్నారు. రాష్ట్రంలోని 561ఎంఏఓల్లో 364 మంది జియో మార్కింగ్ పొందారు.

**ఏడీఎలకూ :** ఏడీఎలు కూడా తమ పరిధిలోని ఎంఏఓల ఫోన్ నంబర్ల అనుసంధానంతో వైఎస్ఆర్ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. అయితే ఆయన తన కార్యాలయ పరిధిని రిజిస్టర్ చేసుకోవాలి. వారికి కూడా ఎక్సలెన్ట్, గుడ్, ఫెయిర్, పూర్‌గా మార్కులు ఉంటాయి. ఈయాప్ ఎవరి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగంకలిగించదు. కేవలం నిర్దిష్ట సమయాల్లో మాత్రమే ఇది పనిచేస్తుంది.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# వివిధ పంటల్లో విత్తన శుద్ధి - ప్రాముఖ్యత



డా. కె. వసంత భాను, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు



విత్తుకొద్దీ పంట అని అంటారు. అధిక దిగుబడులకు ఏ పంటలోనైనా సరే నాణ్యమైన విత్తనం అవసరం. నాణ్యమైన అంటే అధిక మొలక శాతం కలిగి, విత్తన ప్రామాణికాలకు తగినట్లు ఉండటం. ప్రస్తుతం రైతులు సార్వా పంటల సాగుకి సంసిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు విత్తన శుద్ధి, దాని ప్రాముఖ్యత మరియు చేయు విధానం గురించి తెలుసుకొందాము.

తెగుళ్ళు మరియు పురుగులు ఆశించకుండా నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు ఏ పంటలో నైనా విత్తనశుద్ధి అనేది సమగ్ర సస్యరక్షణలో చాలా ముఖ్యం. దీనివలన సస్యరక్షణ ఖర్చుని చాలావరకు తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా విత్తిన తరువాత మొదటి 30 రోజులలో పైరుని చీడపీడలు ఆశించకుండా నివారించుకోవచ్చు. విత్తన శుద్ధి అనేది ముఖ్యంగా విత్తనం లేదా భూమి ద్వారా వ్యాపించే తెగుళ్ల నివారణకు మరియు నిల్వ ధాన్యాన్ని ఆశించే పురుగుల నివారణకు సాధారణంగా చేసేవారు. కానీ ఇటీవల కాలంలో ప్రతి పంటలోను రసం పీల్చే పురుగుల ద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగుళ్ళు అధిక మవుతున్న తరుణంలో పురుగు మందుల ద్వారా విత్తనశుద్ధి కూడా ప్రాముఖ్యత సంతరించుకొంది. పురుగు మరియు తెగుళ్ళ మందులతోనే కాక జీవ శిలీంధ్ర నాశినులైనటువంటి ట్రైకోడెర్మా విరిడి మరియు సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ వంటివి, రైజోబియం వంటిజీవన ఎరువులతో కూడా విత్తన శుద్ధి చేయవలసిన అవసరం ఏర్పడింది.

## విత్తన శుద్ధి వలన కలిగే ఉపయోగాలు :

చీడ పీడల వ్యాప్తిని ఇతర విధానాల కంటే కూడా సమర్ధవంతంగా అరికట్టవచ్చు.

మొలకెత్తుతున్న విత్తనాన్ని వేరుకుళ్ళు మరియు నారుకుళ్ళు రోగాల నుండి రక్షిస్తుంది. మొలక శాతం పెరుగుతుంది. మొక్కల సాంద్రత పొలమంతా సమానంగా ఉంటుంది. కొన్ని రకాల భూమిలో నివసించి నష్టపరిచే పురుగులని (చెద పురుగులు, వేరు పురుగులు) కూడా అరికట్టవచ్చు.

**వరి :** పొడి విత్తన శుద్ధికి కిలో విత్తనానికి మూడు గ్రా॥ కార్బెండిజమ్ 50 శాతం మందును కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దుంప నారుమళ్ళకు అయితే లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున కార్బెండిజమ్ 50 శాతం మందును కలిపి ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మండె కట్టి మొలకెత్తిన విత్తనాన్ని దుంప నారుమడిలో చల్లుకోవాలి. దీనివలన అగ్గితెగులు, ఆకుమచ్చ తెగుళ్ళ, మానిపండు తెగులు మరియు పొడ తెగులు అదుపులో ఉంటాయి.

**మొక్కజొన్న :** కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయడం వల్ల ఆకు మాడు తెగులు, పాముపొడ తెగులు బారి నుండి కాపాడుకోవచ్చు. మొక్కజొన్నలో కత్తెరపురుగు నివారణకు కిలో విత్తనానికి 4 గ్రాముల ఫ్లోర్టెంజోడ్యూ (సయానిట్రినిలిప్రోల్ + థయోమిథాక్సిమ్) మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి.

**జొన్న :** కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. మొవ్వ ఈగ నివారణకు ఒక కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాక్సిమ్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి.

**సజ్జ :** 2 శాతం (20 గ్రా. లీ) ఉప్పు నీటి ద్రావణంలో విత్తనాలను 10 నిమిషాలు ఉంచటం ద్వారా ఎర్గాట్ శిలీంద్ర అవశేషాలను తేలేల చేసి తొలగించవచ్చు. ఆరిన తరువాత కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ కలిపి విత్తన శుద్ధి చేయాలి.

**కంది :** 200 గ్రాముల రైజోబియం కల్చర్‌ను 100 గ్రా.ల బెల్లం పాకంలో కలిపి ఎకరానికి సరిపడే విత్తనాలకి పట్టించి విత్తితే అధిక దిగుబడులు పొందవచ్చు. 4-5 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి కేజీ విత్తనాలకి కలిపి కూడా విత్తనశుద్ధి చేసుకొంటే కనుక వేరుకుళ్ళు, వడలు తెగులు మరియు ఎండు తెగులు నుండి పైరును కాపాడుకోవచ్చు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

**మినుము, పెసర పంట :** విత్తుకొనే 24-28 గంటల ముందుగా ఒక కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్. (గౌచ్) 5. మి.లీ. లేదా థయోమిథాక్సిమ్ 70 డబ్ల్యూ.ఎస్. (క్రూజర్) 5 గ్రా. కలిపి విత్తన శుద్ధి చేస్తే తొలిదశలో వైరస్ తెగుళ్ళను వ్యాప్తి చేసే రసం పీల్చే పురుగులు మరియు కార్బెండజిమ్ లేదా మాంకోజెట్ 2.5 గ్రా. కలిపి విత్తన శుద్ధి చేస్తే వేరుకుళ్ళు తెగుళ్ల బారినుండి పంటను కాపాడవచ్చు. వైరస్ తెగుళ్ల నివారణకు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి.

ఇటీవల కాలంలో ఆశిస్తున్న కాండం గజ్జి తెగులు నివారణకు 4-5 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి కేజీ విత్తనాలకి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.

**శనగ :** కిలో విత్తనానికి 2.5 గ్రా.ల థైరమ్ లేదా కాప్టాన్ లేదా 3 గ్రా.ల కార్బెండజిమ్ లేదా 10 గ్రా.ల ట్రైకెడెర్మావిరిడి లేదా 1.5 గ్రా.ల వైటవాక్స్ మందుతో విత్తనశుద్ధి చేయటం వల్ల విత్తనం, నేల ద్వారా సంక్రమించే ఎండుతెగులు, వేరుకుళ్ళు తెగుళ్ళ నుంచి రక్షించుకోవచ్చు.

**వేరుశనగ :** తెగుళ్ళ నివారణకి కిలో విత్తనానికి ఒక గ్రాము టేబ్యుకొనజోల్ 2 డి.ఎస్. లేదా 3 గ్రా. మాంకోజెట్ లేదా ట్రైకోడెర్మావిరిడి పొడి మందును పట్టించాలి. కాండం కుళ్ళు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి ఒక మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్. (గౌచ్) 6. మి.లీ. నీటి మిశ్రమం మందుతో విత్తన శుద్ధి చేయాలి. వేరు పురుగు ఆశించే ప్రాంతాల్లో 6.0 మి.లీ. క్లోరిపైరిఫాస్ ద్రావణంతో కిలో విత్తనాలకి కలిపి శుద్ధి చేయాలి. వరి మాగాణుల్లో లేదా కొత్తగా వేరుశనగ సాగుచేసేటప్పుడు విత్తనానికి రైజోబియం కల్చర్‌ను పట్టించాలి. మొదలు కుళ్ళు, వేరుకుళ్ళు, కాండం కుళ్ళు తెగులు ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడి పట్టించాలి. విత్తనాన్ని మొదట క్రిమిసంహారక మందుతో శుద్ధి చేసి, నీడలో ఆరబెట్టిన తరువాత శిలీంధ్ర నాశినితో శుద్ధి చేయాలి. అవసరమైతే రైజోబియం కల్చర్‌ను కూడా విత్తనాలకు పట్టించాలి.

**నువ్వులు :** కిలో విత్తనానికి 3 గ్రా.ల థైరమ్ లేదా కాప్టాన్ లేదా మాంకోజెట్ లేదా 1 గ్రా. కార్బెండిజిమ్‌తో విత్తన శుద్ధి చేయటం వల్ల నేల నుంచి సంక్రమించే తెగుళ్ళను 21 రోజుల వరకు నివారించుకోవచ్చు.

**పొద్దుతిరుగుడు :** ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు నివారణకు క్వింటాల్ (ఇప్రోడియన్ 25 శాతం + కార్బెండజిమ్ 25 శాతం) లేదా సాఫ్ (కార్బెండజిమ్ 12 శాతం + మాంకోజెట్ 63 శాతం) అనే మందు 2 గ్రా. చొప్పున కిలో విత్తనానికి వాడి విత్తన శుద్ధి చేయాలి. నెక్రోసిస్ వైరస్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి థయోమిథాక్సిమ్ (క్రూయిజర్) 4 గ్రా. లేక 5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ కలిపి విత్తన శుద్ధి చేయాలి.

**పత్తి :** పత్తిలో రసం పీల్చే పురుగుల తాకిడి ఎక్కువ. ప్రస్తుతం మార్కెట్‌లో బి.టి. విత్తనం రసం పీల్చే పురుగుల నివారణకు విత్తన శుద్ధి చేసి ఉంటుంది. నాన్ బి.టి. సాగు చేసే రైతులు కిలో విత్తనానికి తగినంత జిగురు కలిపి 5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ లేదా 4 గ్రా. థయోమిథాక్సిమ్‌తో విత్తన శుద్ధి చేసి విత్తితే పంటను 40-45 రోజుల వరకు రసం పీల్చే పురుగుల నుండి రక్షించుకోవచ్చు. అదేవిధంగా తెగుళ్ళ నివారణకు కిలో విత్తనానికి 2 గ్రా. కార్బెండజిమ్ లేదా 2 గ్రా. కార్బాక్సిన్ లేదా 3 గ్రా. థైరం లేదా 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడి / సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్‌తో విత్తన శుద్ధి చేయాలి.

**మిరప :** కిలో మిరప విత్తనానికి మొదటగా వైరస్ తెగుళ్ల నివారణకు గాను 150 గ్రా. ట్రైసోడియం ఆర్థో ఫాస్ఫేట్‌ను ఒక లీటరు నీటిలో కరిగించి ఆ మందు ద్రావణంలో 15-30 నిమిషాల పాటు విత్తనాన్ని నానబెట్టాలి. ఆ తర్వాత రసం పీల్చే పురుగుల నివారణకు 8 గ్రా.ల ఇమిడాక్లోప్రిడ్‌ను, చివరగా ఇతర తెగుళ్ల నివారణకు 3 గ్రా.ల కాప్టాన్ లేదా 3 గ్రా.ల మాంకోజెబ్ కలిపి విత్తన శుద్ధి చేయాలి. దీనివల్ల కొమ్మ ఎండు తెగులు, కాయ కుళ్ళు తగ్గి, దిగుబడి, నాణ్యత బాగుంటాయి. వేరుకుళ్ళు, వడలు తెగులు నివారణకి 4-5 గ్రాముల ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేయాలి.

**ఉల్లి మరియు ఇతర కూరగాయల పంటలు :** కిలో విత్తనానికి 8 గ్రా. ట్రైకోడెర్మావిరిడి లేదా 3 గ్రా. థైరం కలిపి విత్తన శుద్ధి చేయాలి. దీనివలన నారుకుళ్ళు మరియు వేరుకుళ్ళు తెగుళ్లను నివారించవచ్చు.

**ద్రవరూప జీవన ఎరువులు :** అజటోబాక్టర్ 200 మి.లీ. ను 5-10 లీటర్ల నీటిలో కలిపి నారు నాటే ముందు అరగంట వరకు నారును ద్రావణంలో ముంచి నాటుకోవాలి.

విత్తన శుద్ధి చేసేటప్పుడు తప్పనిసరిగా గ్లౌజు తొడుగుకుని చేయలి లేదా విత్తనశుద్ధి చేసే పరికరాన్ని ఉపయోగించి చేసుకోవాలి.

# విత్తన శుద్ధి - పద్ధతులు

శ్రీ పి. ప్రసాదరావు, వ్యవసాయాధికారి (సాంకేతిక సహాయకుడు), సహాయ వ్యవసాయ సంచాలకులు (నియమిత) వారి కార్యాలయం, విజయనగరం

**తల్లి గర్భంలోని శిశువు బాహ్య ప్రపంచంలోకి వచ్చిన వెంటనే టీకాల రూపంలో రక్షణ కల్పించినట్లుగా విత్తన గర్భంలో ఉన్న అంకురం మొలకెత్తిన వెంటనే చీడపీడలు ఆశించకుండా సంరక్షించే ప్రక్రియే విత్తన శుద్ధి.**

విత్తనశుద్ధి చేయడానికి ప్రత్యేక పరిజ్ఞానం అవసరం లేదు. గోలీలు, కుండలు, డ్రమ్ములు , పాలిథీన్ సంచులు వంటి సాధారణ పరికరాలే వాడవచ్చు. రైతులు స్వయంగా సులభంగా చేసుకోవచ్చు.

## విత్తన శుద్ధి పద్ధతులు :

**పొడి విత్తన శుద్ధి :** విత్తన శుద్ధి కొరకు ప్రత్యేకంగా తయారు చేసిన డ్రమ్ములో మూడులో రెండింతల వరకు విత్తనం వేసిన తర్వాత, సిఫారసు చేసిన మందు పొడిని పోసి తిప్పాలి. కొన్ని విత్తనములకు ముందుగా జిగురు, బెల్లం, చిక్కటి గంజి వంటి పదార్థాలతో తయారు చేసుకున్న ద్రావణాన్ని పట్టించి, ఆ తరువాత సిఫారసు చేసిన మందును కలపడం వల్ల విత్తనాలపై సమానంగా రక్షణ కవచం ఏర్పడి, తద్వారా తెగుళ్ళు నివారణ సాధ్యమవుతుంది. తక్కువ మోతాదులో విత్తనం ఉన్నప్పుడు కుండలలో కానీ, మందమైన ప్లాస్టిక్ సంచులలో కానీ విత్తన శుద్ధి చేయవచ్చు.

**తడి విత్తన శుద్ధి :** కొన్ని రకాల విత్తనాలకు ముఖ్యంగా వరి వంటి వాటికి కీటక నాశనులు, శిలీంద్ర నాశనులు తగినంత నీటిలో కలిపి ఆ నీటిలో విత్తనాన్ని నానబెట్టిన తర్వాత విత్తుకోవాలి.

**స్లర్రీ ట్రీట్‌మెంట్ పద్ధతి :** (చిక్కని ద్రావణాన్ని విత్తనానికి పట్టించడం) ఈ పద్ధతిలో నీటిలో కరిగే అంతర్వాహిక శిలీంద్ర లేదా కీటక నాశినులను నీటిలో కలిపి చిక్కని ద్రావణంలా తయారు చేసుకొని ఆ ద్రావణాన్ని విత్తనాలకు పట్టించి నీడలో ఆరబెట్టుకొని విత్తుకోవాలి. దీనివల్ల విత్తనం మీద వున్న వ్యాధి కారకాలనే కాకుండా విత్తనం లోపల వున్న శిలీంద్రాల నుండి కూడా రక్షణ పొందవచ్చు.

**వేడినీరు మరియు ఆవిరితో విత్తనశుద్ధి :** చెరకు విత్తన ముచ్చెలను 50 డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత గల వేడి నీటితో లేదా ఆవిరితో శుద్ధి చేసిన తర్వాత శిలీంద్ర నాశినితో శుద్ధి చేయడం వల్ల ఎర్రకుళ్ళు తెగులు నివారణ. కూరగాయ పంటలలో కూడా కొన్ని రకాల వైరస్ మరియు బ్యాక్టీరియా తెగుళ్ళను కూడా విత్తనాలను వేడి నీటితో శుద్ధి చేసి నివారించవచ్చు.

**జీవ నియంత్రణ పద్ధతులు :** జీవ నియంత్రణ పద్ధతి అనగా ఒక జీవిని ఉపయోగించి మరొక దానిని నశింపజేయడం. పైరుకు నష్టం కల్గించు పురుగులను, శిలీంద్రాలను వాటి సహజ శత్రువులను ఉపయోగించి పైరును కాపాడుకొనుట.

**సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ :** బాక్టీరియాకు చెందిన జీవ శిలీంద్ర నాశిని. వాడు విధానం : 10 గ్రా. సూడోమోనాస్‌ను ఫ్లోరిసెన్స్‌ను కిలో విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేయాలి.

వరి పంటపై వచ్చు పొడ తెగులు బ్యాక్టీరియల్ ఆకుమచ్చ తెగులు, అగ్గి తెగుళ్ళు మొక్కజొన్నలో పొడ తెగులు, వేరుశనగలో ఆకుమచ్చ తెగులు, మిరపలో మాగుడు తెగులు మరియు అరటిలో పనామా తెగుళ్లను అరికడుతుంది.

**ట్రైకోడెర్మావిరిడి :** శిలీంద్ర జాతికి చెందిన జీవ శిలీంద్రనాశిని. దీనిని వాడినపుడు యాంటీబయోటిక్స్‌ను ఉత్పత్తి చేసి తెగులును కలుగచేసే శిలీంద్రాలను అదుపు చేస్తుంది. ఈ శిలీంద్రనాశిని తెగులు పారక శిలీంద్ర పోగులను చుట్టుకొని వాటి పెరుగుదలను అరికడుతుంది.

వాడు విధానం : 10 గ్రాముల ట్రైకోడెర్మవిరిడి పొడి మందు కిలో విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేయాలి. ప్రత్తి, మిరప, అపరాలు, వేరుశనగ, మొక్కజొన్న, పసుపు, అల్లం, చెఱకు, కూరగాయలు మొ॥గు పంటలలో వేరుకుళ్ళు, వడ తెగులు, దుంప కుళ్ళు, ఎండు తెగులు, ఎర్రకుళ్ళు తెగులు మరియు మాగుడు తెగుళ్ళను నివారిస్తుంది.



"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# వరిలో అధిక దిగుబడికి ఉత్తమ యాజమాన్య పద్ధతులు



డా. పి. సుధా జాకబ్, సీనియర్ శాస్త్రవేత్త మరియు డా. కె. ఝాన్సీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల



ఖరీఫ్ సీజన్లో తక్కువ విస్తీర్ణం, నీరు, పెట్టుబడితో అధిక దిగుబడి సాధించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ లక్ష్య సాధనకు వరి సాగులో క్రింద సూచించబడిన ఉత్తమ యాజమాన్య మెలకువలు పాటించిన యెడల సాగు ఖర్చు తగ్గి మంచి దిగుబడులు సాధించడం ద్వారా నికర ఆదాయాన్ని పెంచుకోవచ్చు.

**విత్తన రకాల ఎంపిక :** వివిధ ప్రాంతాలకు అవసరమైన వరి వంగడాలను ఆయా జిల్లాల వ్యవసాయ శాఖ వారు సూచన మేరకు ఎంపిక చేసుకోవాలి.

**విత్తన శుద్ధి :** విత్తనం ద్వారా వ్యాప్తి చెందే కొన్ని రకాల తెగుళ్ల ఉధృతిని అరికట్టడానికి విత్తన శుద్ధి అవసరం. పొడి విత్తన శుద్ధి కొరకు కిలో వరి విత్తనానికి మూడు గ్రాముల కార్బెండిజమ్ 50 శాతము మందును కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లుకోవాలి. దుంప నారుమళ్లకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ 50 శాతము మందును కలిపి, ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి, మండె కట్టి మొలకెత్తిన విత్తనాన్ని దుంప నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు నీరు సరిపోతుంది. కార్బెండిజమ్ 25% మరియు మాంకొజెబ్ 50% మిశ్రమ శిలీంధ్రనాశినిని వాడితే 2.0 గ్రా. లీటరు నీటికి వంతున వాడాలి.

**విత్తన మోతాదు :** నాటే పద్ధతి : 20 - 25 కిలోలు. వెదజల్లుట : 12 -15 కిలోలు

**నారుమడి :** దృఢమైన ఆరోగ్యవంతమైన నారు పొందాలంటే నారుమడిలో విత్తనం వేయడానికి ముందు 10-12 రోజుల వ్యవధిలో బాగా దున్ని, కలుపు లేకుండా చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేయాలి. సెంటుకు 5 కిలోల విత్తనం చల్లుకోవాలి. విత్తనం ఎక్కువైతే నారు బలహీనంగా ఉండి, తెగుళ్ళు సోకే అవకాశం ఉంటుంది. తక్కువ విత్తనాలు పోస్తే నారు తీసేటప్పుడు వేర్లు తెగిపోయి నారు సులువుగా రాదు. మొలకెత్తిన విత్తనాన్ని పలుచటి నీరు మీద చల్లుకోవాలి. నారు 2-3 ఆకులు తొడిగే వరకు ఆరు తడి పెట్టి, తరువాత పలుచగా నీరు పెట్టుకోవాలి.

బాగా చివికిన పశువుల ఎరువు లేదా కంపోస్టును 5 సెంట్ల నారుమడికి 200 కిలోలు వేయాలి. 5 సెంట్ల నారుమడికి 6.25 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 4.4 కిలోల యూరియా (2.2 కిలోలు విత్తనం చల్లే ముందు, మరో 2.2 కిలోలు 12-14 రోజులకు) మరియు 1.6 కిలోల మ్యురేట్ ఆఫ్ పోటాష్‌ను విత్తనం వేసుకునేటప్పుడు పురుగుల నివారణకు ప్రతి సెంటు నారుమడికి కార్బోఫ్యురాన్ 3జి గుళికలను 160 గ్రా. చొప్పున ఇసుకలో కలిపి పలుచగా చల్లుకోవాలి. అవసరతను బట్టి ఇతర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నారుమడిలో కలుపు నివారణకు కలుపు కూలీలతో తీయించాలి. ఊద ఎక్కువగా ఉన్నట్లయితే విత్తిన 14-15 రోజులకు సైహాలోఫాప్ బ్యుటైల్ (క్లించర్)ను లీటరు నీటికి 2.0 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేయాలి. గడ్డి, తుంగ మరియు ఆకు జాతి కలుపు మొక్కలు ఉన్నట్లయితే బిస్ పైరి బాక్ సోడియం (నామిని గోల్డ్, ఆదోర) ను లీటరు నీటికి 0.5 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేయాలి.

## వరిని నేరుగా విత్తే పద్ధతులు :

వరిసాగులో కూలీలపై ఖర్చు పెరగడం, కూలీలు సకాలంలో లభ్యం కావడం కష్టంగా మారింది. సరైన సమయంలో సాగు నీరు లభ్యము కాకపోవడం, వర్షాభావ పరిస్థితుల వలన సకాలంలో వరి నాట్లు వేయలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితులలో సాగు ఖర్చు తగ్గించుకొని, కూలీల సమస్యను అధిగమిస్తూ ప్రత్యామ్నాయ పద్ధతిలో వరిని నేరుగా విత్తుకునే పద్ధతులను రైతులు అమలుపరుస్తున్నారు. ఈ విధానములో విత్తనం ఎకరానికి 15-18 కిలోలు ఆదా అవుతుంది. పంట కోతకు 7 రోజులు

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



ముందుగా వస్తుంది. నారుమడి యాజమాన్యము, నాట్లు వేసే పని ఉండదు కాబట్టి సాగు ఖర్చు ఎకరానికి రూ. 3000 వరకు తగ్గుతుంది. కూలీల కొరతను అధిగమించి తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణం విత్తుకోవచ్చు.

**1. ప్రధాన పొలములో నేరుగా పొడి విత్తనాలను ట్రాక్టరు సహాయముతో నడిచే సీడ్ డ్రిల్ ద్వారా వేయుట:** ప్రధాన పొలమును 2-3 సార్లు దుక్కి దున్నుకొని కలుపు లేకుండా శుభ్రము చేసుకోవాలి. విత్తిన శుద్ధి చేసిన పొడి విత్తనమును (ఎకరాకు 12-15 కిలోలు) తీసుకొని ట్రాక్టరు సహాయముతో నడిచే సీడ్ డ్రిల్ ద్వారా పొలములో ఎద పెట్టాలి.

**2. ప్రధాన పొలములో మొలకెత్తిన విత్తనములను వేయుట :** ఈ పద్ధతిలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి, 24 గంటల పాటు మండె కట్టాలి. 24 గంటల తర్వాత విత్తనాల ముక్కు పగిలి తెల్లగా మోసు వస్తుంది. విత్తనము నుండి మొలక పొడుగ్గా రాకుండా రైతులు జాగ్రత్త తీసుకోవాలి. పొలాన్ని దమ్ము చేసుకుని కలుపు లేకుండా శుభ్రముగా తయారు చేసుకోవాలి. పొలం బాగా చదును చేసుకొని, పొలంలో నీరు నిలువ ఉండకుండా బయటికి పోవటానికి ఏర్పాట్లు చేయాలి. అవసరం అయితే పెద్ద మడులను చిన్న చిన్న మడులుగా విభజించుకొని చదును చేయాలి. దీని ద్వారా నీటి యాజమాన్యము సులువు అవుతుంది.

**ఎ) నేరుగా మొలకెత్తిన విత్తనమును పొలంలో చల్లుట :** దమ్ము చేసి చదును చేసిన పొలంలో మండె కట్టిన విత్తనాన్ని పొలమంతా సమంగా పల్చటి నీటిపొర ఉంచి వెదజల్లాలి.

**బి) డ్రమ్ సీడర్ పద్ధతి :** డ్రమ్ సీడర్ పరికరం ద్వారా 8 వరుసల్లో విత్తనాలను ఒకేసారి విత్తుకోవచ్చు. ఈ పరికరము ద్వారా వరుసల మధ్య 20 సెం.మీ. దూరంలో గింజలు పడతాయి. వరుసల్లో కుదురుకు కుదురుకు మధ్య దూరం 5-8 సెం.మీ. వుంటుంది. ఒక్కో కుదురులో 5-8 గింజలు రాలడం జరుగుతుంది. రకాన్ని బట్టి గింజలు రాలడాన్ని బట్టి రంధ్రాలను స్టాపరుతో మూసుకోవాలి. సన్నగింజ రకాలకు రంధ్రం వదిలి రంధ్రం మూసివేయాలి. ప్రతి 16 వరుసలకు అడుగు వెడల్పు కాలిబాటలు ఉంచుకోవాలి. తాడు వాడి డ్రమ్ లాగితే వరుసలు బాగా వస్తాయి. కోనోవీడర్ తిప్పడానికి వీలుగా ఉంటుంది.

నేరుగా వరి విత్తనము వేసిన పంట తొలిదశలో నీరు నిలకట్టక ఆరుతడిగా సాగుచేయడం వలన కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ పద్ధతిలో కలుపు మందును తప్పనిసరిగా వాడాలి. ఒక ఎకరాకు 35 గ్రా. ఆక్సాడయార్జిల్ మందును లేదా ప్రెటిల్లా క్లోర్ 400 మి.లీ.లు లేదా పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 100 గ్రా. మందును 20 కిలోల పొడి ఇసుకలో కలిపి విత్తిన 3-5 రోజుల మధ్య (మొలకలు పచ్చగా తిరిగి తర్వాత) పొలంలో పలుచగా నీరు పెట్టి కలుపు మందును చల్లాలి. ఆ తర్వాత పొలంలోని నీటిని తీసివేయకుండా జాగ్రత్త పడాలి.

వరిని వరుసలలో విత్తినప్పుడు, విత్తిన 20-25 రోజులకు కోనోవీడర్‌ని నడపాలి. కోనోవీడర్ నడపడం వలన వరుసల్లో మొలచిన కలుపు భూమిలోకి కలియబడుతుంది. తదుపరి 10 రోజులకొకసారి 2 సార్లు కలుపు ఉన్నా లేకపోయినా కోనోవీడర్‌ను వరుసల్లో నడపడం వలన భూమి బాగా కదిలి, వేరు వ్యవస్థకు గాలి, పోషకాలు బాగా అందుతాయి. ఎక్కువ పీచు వేర్లు వృద్ధి చెంది వేరు వ్యవస్థ బలంగా తయారవుతుంది. దీనివలన అధిక సంఖ్యలో పిలకలు పెట్టి మొక్క గుబురుగా తయారవుతుంది. దిగుబడి పెరుగుతుంది. కోనోవీడర్‌ను నడపాలనుకున్న ముందురోజు సాయంత్రం పొలంలో పలుచగా నీరు పెట్టాలి. పలుచని నీటి పొర మీద పళ్ళ చక్రాలు మట్టి అంటుకోకుండా బాగా దొర్లుతాయి. పైరు పెరిగే దశలో అక్కడక్కడ మిగిలిన కలుపు మొక్కలను కూలీలచేత తీయించాలి.

విత్తిన 20 రోజుల తర్వాత కలుపు సమస్య అధికంగా వుంటే బిస్ పైరిబాక్ సోడియం అనే కలుపు మందును 80 నుండి 120 మి.లీ. 200 లీ. నీటికి కలిపి కలుపు మొక్కల మీద పిచికారి చేయాలి. ఊద ఎక్కువగా వున్న పొలానికి సైహలోఫాప్ బ్యుటెల్ మందుని 300-400 మి.లీ. వెడల్పాటి ఆకులున్న కలుపు మొక్కలు ఎక్కువగా వుంటే 2, 4డి సోడియం లవణం 400 గ్రా. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో నీటిని తీసివేసి కలుపు మొక్కలపై పిచికారి చేయాలి.




"చీడపీడలపై మీ సందేహాలను 8331056028 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# ఆన్‌లైన్ పద్ధతిలో విత్తన ధృవీకరణ ప్రక్రియ



డా. ఏ. త్రివిక్రమ రెడ్డి, సంచాలకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ, గుంటూరు




ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో విత్తన ధృవీకరణ ప్రక్రియను ఆన్ లైన్ పద్ధతి ద్వారా జరిపించ వలసినదిగా 25-3-2021 తేదీన వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి అధ్యక్షతన జరిగి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ 133 వ పాలక మండలి సమావేశంలో నిర్ణయించారు. కావున విత్తన ధృవీకరణ ప్రక్రియను ఖరీఫ్ 2021 సం॥ నుండి ఆన్‌లైన్ పద్ధతి ద్వారా చేపట్టడానికి తగు విధమైన ఏర్పాట్లు చేశారు.

ఇందువలన విత్తన ధృవీకరణ ప్రక్రియను చాలా సులువుగా సమయము వృధా కాకుండా తక్కువ మందిని వినియోగించి, రైతులు, రైతు సంఘాలు మరియు విత్తనోత్పత్తిదారులు తగిన సమయములో చేసుకొనవచ్చును. ఈ విధముగా చేయుట వలన విత్తనోత్పత్తి మరియు విత్తన ధృవీకరణ తగు ఖచ్చితత్వముతో, బాధ్యతగా, వేగంగా నిర్వహించటానికి అనుకూలముగా ఉంటుంది.

విత్తన ధృవీకరణ సంస్థ ఈ విధంగా ఆన్ లైన్ ధృవీకరణ పద్ధతిని ప్రవేశపెట్టు వలన సమయాభావాన్ని అధిగమించి, నిబద్ధతతో, పారదర్శకంగా అన్ని ముఖ్యమైన పంటల మేలురకముల నాణ్యమైన విత్తనములను పెంపొందించి రైతులకు అందుబాటులో ఉంచి సకాలంలో సరఫరా చేయుటకు సహాయ పడుతుంది. ఈ విధానము వలన విత్తన ధృవీకరణ సంస్థకు, విత్తనోత్పత్తి దారులకు, రైతులకు, మరియు రైతు సంఘాలకు మధ్య బలమైన అనుసంధానం ఏర్పడి బాధ్యతాయుతముగా తమ తమ కర్తవ్యం నిర్వర్తించడానికి చాలా అనుకూలంగా ఉంటుంది.

ఈ విధముగా ఆన్‌లైన్ విధానంలో విత్తన ధృవీకరణ చేపట్టడానికి అనుకూలంగా రాష్ట్రంలో అన్ని సీనియర్ విత్తన ధృవీకరణ అధికారి కార్యాలయముల నందు (డివిజనల్ ఆఫీసు) విత్తన ధృవీకరణ అధికారులకు, విత్తనోత్పత్తి దారులకు, రైతులకు మరియు రైతు సంఘాలకు అవగాహనా సదస్సులను నిర్వహించడం జరిగినది. ఈ ఆన్‌లైన్ విధానాన్ని సమర్ధవంతంగా అమలు చేయుటకు కావలసిన అన్ని సౌకర్యములు అనగా, సాఫ్ట్‌వేర్ కంప్యూటర్లు, వెబ్ కెమెరాలు, ప్రింటర్లు, ఇంటర్నెట్ కనెక్షన్లు ఏర్పాటు చేయటం జరిగినది. విత్తన ధృవీకరణ అధికారులకు, విత్తన సంస్థల ప్రతినిధులకు, విత్తనోత్పత్తిదారులకు, రైతులకు మరియు రైతు సంఘాలకు ఆన్‌లైన్ విత్తన ధృవీకరణ చేసుకొనుటకు అవసరమైన మెళకువలు కావలసిన పత్రములు మరియు దానిని పాటించడం వలన కలిగే ప్రయోజనములు అన్ని అవగాహన కలుగు విధంగా తెలియజేయుట జరిగినది.

కొత్త ఆన్ లైన్ విధానంలో విత్తన ధృవీకరణ చేయుటలో భాగంగా ఈ సంవత్సరం 20 మంది విత్తన ధృవీకరణ అధికారులను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవడం జరిగినది. ఆన్ లైన్ పద్ధతి ద్వారా ఖచ్చితమైన విధాన నిర్ణయాలతో రైతులకు నాణ్యమైన విత్తనములు సరఫరా చేయుటకు విత్తన ధృవీకరణ సంస్థకు అవకాశం ఏర్పడుతుంది. ఆన్‌లైన్ ధృవీకరణ పోర్టల్‌లో గల సమాచారం కేవలం రైతులకు, రైతు సంఘాలకు, విత్తనోత్పత్తి దారులకు మాత్రమే కాక వ్యవసాయశాఖ, వ్యవసాయ విశ్వ విద్యాలయాలకు, సీడ్ కార్పోరేషన్‌లకు మరియు ఇతర సంబంధిత శాఖలకు ఉపయోగపడుతుంది.

కాబట్టి ఈ సౌకర్యాములను అన్ని విత్తన ఉత్పత్తిదారులు, విత్తన ఉత్పత్తి రైతులు, మరియు రైతు సంఘాలు సకాలంలో ఉపయోగించుకొని విత్తన ధృవీకరణ సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్ రైతాంగానికే కాక ఇతర రాష్ట్ర రైతులకు కూడా నాణ్యమైన విత్తనములను పారదర్శకంగా, సకాలంలో పెంపొందించి సరఫరా చేయువిధంగా సహాయ పడదానికి సహకరించవలసినదిగా మరియు రైతులు ఈ సదవకాశమును సద్వినియోగ పరచుకొనవలసినదిగా కోరుచున్నాము.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# రైతు సేవలో ఏడాది

రైతు సంక్షేమమే ధ్యేయంగా కృషిచేస్తున్న ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారు రైతులకు మార్గదర్శకంగా నిలవాలన్న ఉద్దేశ్యంతో సరిగ్గా ఏడాది క్రితం డా॥ వైఎస్ఆర్ రైతుభరోసా మాసపత్రికను ప్రారంభించారు. ఈ ఏడాదిలో ఈ మాసపత్రిక రైతులకు పంటసాగులో దిక్సూచిగా నిలుస్తూ వారి ఆదరాభిమానాలను ఎంతగానో చూరగొంటోంది. ఏడాది పూర్తైన సందర్భంగా గత ఏడాది కాలంలో రైతుభరోసా సంచికల విశేషాలు ఒక్కసారి గుర్తు చేసుకుందాం..




జులై : తొలి సంచిక ముఖచిత్రం



ఆగష్టు : వ్యవసాయ ప్రయోగశాలలకు శ్రీకారం



సెప్టెంబర్ : అన్నదాతకు ఆధునిక సాయం



అక్టోబర్ : బీడు భూములకు జలకళ



నవంబర్ : రెండోవిడత రైతుభరోసా సాయం



డిసెంబర్ : సున్నా వడ్డీ పంట రుణాలు

జనవరి నుంచి జూన్ విశేషాలు... పేజి 24 లో

"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# వేడుకగా రైతు దినోత్సవం

జులై 8న దివంగత ముఖ్యమంత్రి, మహానేత డా॥ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి జయంతి రోజున రాష్ట్రమంతటా రైతు దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి శ్రీ జగన్‌మోహన్‌రెడ్డి గారు అనంతపురం జిల్లా రాయదుర్గంలో జరిగిన రాష్ట్ర స్థాయి వేడుకలలో పాల్గొన్నారు. ప్రతి ఆర్‌బికే స్థాయిలో ఉత్తమ రైతులను సత్కరించారు. రాయదుర్గంలో జరిగిన వేడుక దృశ్యాలు :



విత్తన తేమ శాతం పరీక్ష ఇలా..




అబ్బా ఎంత పెద్ద మీసాలో... ముఖ్యమంత్రి ఆశ్చర్యం



ఇదీ మా సాయం.. వ్యవసాయ మంత్రి కన్నబాబు



పంటలకు ప్రణాళిక ఉండాలి : వ్యవసాయ సలహా మండలితో..



ఇవీ నమూనా.. శీతల గిడ్డంగుల సముదాయం



ఇవీ మన పంటలు.. ఉద్యాన శాఖ ప్రదర్శన

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



రైతులకు ఏం చేయగలం : వి.ఏ.ఏ.తో మాటామంతీ



నాణ్యత తెలుసుకునేదిలా..



ఆసక్తి : రైతు మిత్ర పురుగుల బొమ్మలు చూస్తూ..



ప్రారంభం : రైతు భరోసా కేంద్ర భవనం



డిజిటల్ ప్రదర్శన



ఇదీ మన మత్స్య సంపద : మత్స్య శాఖ ప్రదర్శన




ఆర్‌బికేలో బ్యాంకింగ్ సేవలు



పారదర్శకత : సామాజిక తనిఖీ జాబితా పరిశీలన

"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# రైతు సేవలో ఏడాది




జనవరి : పెట్టుబడి రాయితీ విడుదల




ఫిబ్రవరి : గణతంత్ర వేడుకల్లో ఆర్‌బీకే ఘనత




మార్చి : రైతుల సేవలో ఆర్‌బికే ఛానల్



ఏప్రియల్ : రైతు విత్తనం రైతుకే




మే : సున్నా వడ్డీపై పంట రుణాలు మంజూరు



జూన్ : రైతన్నలకు పంటల బీమా లబ్ధి

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# తొలకరిలో అపరాల సాగు



వై. రమణ కుమారి, పి. సౌజన్య,
కె. తేజేశ్వరరావు మరియు జి. రామారావు
కృషి విజ్ఞాన కేంద్రం, రస్తాకుంటుబాయి, విజయనగరం జిల్లా

ఖరీఫ్ సాగుకు రైతులు పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేస్తున్నారు. ఈ నెలలో తొలకరి వర్షాలు పడిన వెంటనే మెట్ట భూముల్లో అపరాలు, చిరు ధాన్యాలు, నూనె గింజలు పంటలు వేయడానికి సమాయత్తం అవుతున్నారు. అయితే ఏ రకం నేలకు, ఏ పంట వేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. తెగుళ్ళు తట్టుకొని తక్కువ కాలంలో పంట చేతికి వచ్చే రకాలు ఏమిటి తదితర అంశాలపై పలువురు రైతులకు అంతగా అవగాహన వుండడం లేదు పొలాన్ని సిద్ధం చేయడం నుంచి విత్తనాలు వేయడం, ఎరువులు, సస్యరక్షణ చర్యల వరకు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించవచ్చని మరియు సరైన సమయంలో విత్తుకోవడం వలన వాతావరణం పంటకు అనుకూలించి పురుగులు, తెగుళ్లకు గురికాకుండా, తగిన దిగుబడులు పొందవచ్చు. ఖరీఫ్‌లో పెసర మరియు మినుము వంటి అపరాల పంటల సాగు గురించి రైతులకు అందిస్తున్న సలహాలు, సూచనలు....

పెసరలో ఎల్.జి.జి.407, ఎల్.జి.జి.40, ఎల్.జి.జి.450, ఎల్.జి.జి.460 రకాలు 65 నుంచి 70 రోజుల్లో పంట చేతికి వస్తాయి. టి.యం.96-2, ఐ.పి.యం. 2-14 రకాలు 60 నుంచి 65 రోజుల్లో కోతకు వస్తాయి.

మినుములో ఎల్‌బి.జి. 752, ఎల్.బి.జి. 20, రకాలు 75 నుంచి 80 రోజుల్లో కోతకు వస్తాయి. ఎల్.బి.జి. 623, పి.యు. 31, టి.బి.జి.104 రకాలు 70 నుంచి 75 రోజుల్లో కోతకు వస్తాయి. చౌడు నేలలు తప్ప అన్ని రకాల భూములు అనుకూలం. పొలాన్ని లోతుగా దుక్కి దున్నాలి. నాలుగు టన్నుల పశువుల గెత్తం వేసి మరోసారి గొర్రుతో దున్నాలి.

నేలలో పదును ఉన్నప్పుడు విత్తనాలను గొర్రుతో వరుసల్లో వేసుకోవాలి.

ఎకరాకు ఆరు నుంచి ఏడు కిలోల విత్తనం పెసర పంటకు అవసరం అవుతుంది. మరియు ఎనిమిది నుంచి పది కిలోల విత్తనం మినుము పంటకు అవసరం ఉంటుంది.

కిలో విత్తనానికి 5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మరియు 2 గ్రా. కార్బండజిమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. దీనివలన 20 రోజుల వరకు తెగుళ్ళు, రసం పీల్చే పురుగుల బెడద ఉండదు. అపరాలు లెగ్యూమ్ జాతి పంటలు అయినందున రైజోబియం కల్చర్‌తో విత్తన శుద్ధి చేసినట్లయితే వేరు బుడిపెలలోని రైజోబియం గాలిలోని నత్రజనిని స్వీకరించి మొక్కలకు అందిస్తుంది.

విత్తనం వేసేముందు ఎకరాకు ఎనిమిది కిలోల నత్రజని, ఇరవై కిలోల భాస్వరం పోషకాలని ఇచ్చే ఎరువులను వేయాలి.

వరుసల మధ్య అడుగు దూరం మొక్కల మధ్య 15 సెంటీ మీటర్ల దూరం ఉండేలా విత్తుకోవాలి.

సాధారణంగా తొలకరిలో కురిసే వర్షాలు పెసర పంటలకు సరిపోతాయి. ఒకవేళ ఎక్కువ రోజులు వర్షాలు పడకపోతే పూత, పిందె దశల్లో ఒకటి, రెండు నీటి తడులను అందించాలి.

కలుపు నివారణ కోసం విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు పెండిమిథాలిన్ 30 శాతం మందును ఎకరాకు ఒకటిన్నర లీటర్లను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి.

విత్తిన 30-35 రోజులకు గొర్రుతో అంతర కృషి చేసినట్లయితే కలుపు నశించి, నేల బాగా గుల్లబారి పైరు ఏపుగా పెరుగుతుంది. పూత దశ వరకు పొలంలో కలుపు లేకుండా చూసుకోవాలి.

మొత్తం మీద ఎకరాకు పది వేల రూపాయలకు మించి పెట్టుబడి కాదు.

పెసర పంటకు ఎకరాకు ఐదు నుంచి ఏడు వేల రూపాయలకు మించి పెట్టుబడి కాదు.

పెసర పంటకు ఎకరాకు ఐదు నుంచి ఏడు క్వింటాళ్ళు మరియు మినుము పంటకు ఏడు నుంచి పది క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుంది.

పైన చెప్పిన విధంగా రైతులు పాటించినచో అధిక దిగుబడులను పొంది లాభాలను గడించవచ్చు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056152 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# కంద సాగులో మెలకువలు

డా॥ కె. మమత, ప్రధాన శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధనా స్థానం, కొవ్వూరు, డా॥ జి. రామానందం, ప్రధాన శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధనా స్థానం, కొవ్వూరు, డా॥ ఆర్.వి.యస్.కె. రెడ్డి, పరిశోధన సంచాలకులు, డా॥ వై.యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకటరామన్నగూడెం


విత్తన దుంపలు


విత్తన ముక్కలు


విత్తన శుద్ధి

మన రాష్ట్రంలో పండించే దుంప పంటలలో కంద ప్రధానమైనది. దుంపలలో పోషక విలువలు అధికంగా ఉండడమే కాకుండా అనేక ఔషధ విలువలు కూడా ఉన్నాయి. మన రాష్ట్రంలో కంద ప్రధానంగా ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో సాగు చేస్తున్నారు. అలాగే ఇటీవల కాలంలో నీటి వసతి ఉన్న ప్రాంతాలలో అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాలలో కూడా సాగు చేస్తున్నారు.

**వాతావరణం - నేలలు :** కంద సాగుకు తేమతో కూడిన ఉష్ణమండల ప్రాంతాలు చాలా అనుకూలం. మన రాష్ట్రంలో నీటి వసతి ఉండి మురుగు నీరు పోయే సదుపాయం గల ఎర్ర నేలలు, ఎర్ర గరప నేలలు, నల్లరేగడి నేలలలో సాగు చేసుకోవచ్చు.

**నేల తయారీ :** వేసవిలో భూమిని 30-40 సెం.మీ. లోతుగా దుక్కి దున్నాలి. ఎకరానికి 10 టన్నులు బాగా చివికిన పశువుల ఎరువు, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేసి కలియ దున్నాలి.

**రకములు :**

**గజేంద్ర :** భారతదేశంలోనే అత్యధిక దిగుబడినిచ్చే తీపి కంద రకము. ఉద్యాన పరిశోధనా స్థానం కొవ్వూరు నుండి విడుదల చేయబడింది. 180 నుండి 201 రోజులలో పక్వానికి వచ్చి హెక్టారుకు 60-65 టన్నుల దిగుబడి నిస్తుంది. దుంపలు గుండ్రంగా మధ్యస్థంగా ఉండి పిలకలు లేకుండా ఉంటాయి. దుంపల పైభాగం గోధుమ రంగులో ఉండి కండ లేత పసుపు / నారింజ రంగులో ఉంటుంది. దుంపలలో దురదను కలిగించే ఆక్సాలేట్ల శాతం చాలా తక్కువగా ఉండటం వల్ల అంతర్జాతీయంగా ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

**నాటే సమయం :** మన రాష్ట్రంలో కందను ఖరీఫ్‌లో అన్ని నేలలలోనూ, సారవంతమైన నీటి వసతి ఉన్న నేలల్లో రబీలోనూ సాగు చేసుకోవచ్చు. ఖరీఫ్ పంటను మే-జూన్ నెలల్లో నాటుకొని డిసెంబరు-జనవరి మాసాల్లో తవ్వుకోవచ్చు. అలాగే రబీ పంటను నవంబర్ - జనవరి నెలల్లో నాటుకొని జూలై - ఆగష్టు నెలల్లో తవ్వుకోవచ్చు. రబీ పంటను ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సాగు చేస్తారు.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

**విత్తన మోతాదు :** ఖరీఫ్‌లో నాటుకునే పంటను 300-350 గ్రా. బరువు గల విత్తన దుంపలు, రబీ పంటకు 400-450 గ్రా. బరువు గల విత్తన దుంపలు వినియోగించాలి. అంటే ఖరీఫ్ పంటకు ఎకరానికి 3.5 నుండి 4.00 టన్నుల విత్తనం, రబీ పంటకు ఎకరానికి 4.5 నుండి 5 టన్నుల విత్తనం అవసరమవుతుంది. పెద్ద దుంపలను విత్తనంగా వాడినట్లయితే పైరు ఎక్కువ ఎత్తు పెరిగి ఎరువులు వేయడం మరియు సస్యరక్షణ పద్ధతులు చేపట్టడంలో ఇబ్బంది కలుగుతుంది. అంతే కాకుండా పైరు తొందరగా పడిపోయే ప్రమాదముంది. కాబట్టి సూచించిన మోతాదులో మాత్రమే విత్తనాన్ని ఉపయోగించాలి.

**విత్తన శుద్ధి :** ట్రైకోడెర్మావిరిడి కలిపిన ఆవుపేడ ద్రావణంలో విత్తన దుంపలను ముంచి ఆరబెట్టి నాటుకోవాలి. లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 5 గ్రా. + మోనోక్రోటోఫాస్ 2.5 మి.లీ./లీటరు నీటికి కలిపిన మందు ద్రావణంలో విత్తన దుంపలను 15 నిమిషాలసేపు ముంచి ఆరనిచ్చి నాటుకోవాలి.

**నాటే విధానం :** విత్తన దుంపలను 60 × 60 సెం.మీ. దూరంలో 2 - 2 1/2 అంగుళాల లోతులో నాటి వెంటనే తడి ఇవ్వాలి.

**ఎరువుల యాజమాన్యం :** ఎకరానికి 10 టన్నులు బాగా చివికిన పశువుల ఎరువు, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను వేసి కలియదున్నాలి. కంద మొలకెత్తిన 40, 80, 120 రోజులకు ఎకరానికి 220 కిలోల యూరియ, 170 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను 3 సమ భాగాలుగా చేసి వేయాలి.

**సమగ్ర ఎరువుల యాజమాన్యం :** సిఫార్సు చేసిన ఎరువులలో 75 శాతం రసాయన ఎరువుల రూపంలోనూ, సేంద్రీయ ఎరువుల రూపంలో 25 శాతం వేసి ఎకరానికి 2 కిలోల చొప్పున అజోస్పైరిల్లం మరియు మైకోరైజాను వేసినట్లయితే నాణ్యమైన మంచి దిగుబడులు పొందటానికి అవకాశం ఉంది.

**ధాతులోపాలు :**

**ఇనుప ధాతులోపం :** వర్షాభావ పరిస్థితుల్లో నీటి తుడులు సక్రమంగా ఇవ్వనపుడు ఇనుపధాతు లోపం కనిపిస్తుంది. దీనివల్ల ఆకులు పత్రహరితం కోల్పోయి తెల్లగా మారుతాయి. సరియైన యాజమాన్య చర్యలు చేపట్టక పోయినట్లయితే దుంప దిగుబడి తగ్గుతుంది. నివారణకు 1 లీటరు నీటికి 5 గ్రా. అన్నభేది 1 గ్రా. నిమ్మ ఉప్పు కలిపి వారం పది రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.

**జింకుధాతులోపం :** ఆకులలో ఈనెల మధ్యభాగం పసుపు రంగులోకి మారి క్రమేపీ ఆకు మొత్తం పండి ఎండిపోతుంది. నివారణకు 1 లీ. నీటికి 3 గ్రా. జింక్‌సల్ఫేట్ కలిపి 7-10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి.

**మెగ్నీషియం ధాతులోపం :** కొన్నిసార్లు ఆకులపై లేత పసుపు, ఆకుమచ్చ వర్ణంలో మచ్చలు ఏర్పడి వైరస్ తెగులు లక్షణాలను పోలి ఉంటాయి. నివారణకు లక్షణాలను జాగ్రత్తగా గమనించి మెగ్నీషియం సల్ఫేట్ 3 గ్రా. 1 లీ. నీటికి కలిపి పిచికారీ చేయాలి. ధాతులోప లక్షణాలు మిశ్రమంగా కనబడినట్లయితే సూక్ష్మధాతు మిశ్రమం 5 గ్రా / 1 లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి.



జింక్ ధాతు లోపం



ఇనుము ధాతు లోపం



మెగ్నీషియం ధాతు లోపం

"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# ఖరీఫ్ రాగి సాగుకు అనుకూలమైన రకాలు మరియు అధిక దిగుబడికి సూచనలు

**డా॥ ఎల్. మాధవీలత,** శాస్త్రవేత్త, **డా॥ యం. శాంతిప్రియ,** సీనియర్ శాస్త్రవేత్త, **డా॥ యం. హేమంత్ కుమార్,** ప్రధాన శాస్త్రవేత్త, (చిరుధాన్యాలు), **శ్రీమతి టి.యం. హేమలత,** శాస్త్రవేత్త, **డా॥ సి.వి. చంద్రమోహన్ రెడ్డి,** శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధనా స్థానం, పెరుమాళ్ళపల్లె

గడచిన 50 సంవత్సరాలలో చిరుధాన్యాల పంటల విస్తీర్ణం దాదాపు సగం తగ్గిపోయింది. మారుతున్న వాతావరణ పరిస్థితులలో చిరుధాన్యాల పంటలను సాగుచేయడం వలన ఆహార భద్రతతో పాటు పోషణ భద్రతను సాధించడానికి మరియు ముఖ్యంగా మనము ఆరోగ్యంగా ఉండటానికి బాగా ఉపయోగపడతాయి. ఈ మధ్యకాలంలో ప్రజలలో అవగాహన పెరగటం వలన మరల రైతులు చిరుధాన్యాల పంటల సాగుకు అనుకూలంగా ఉన్నారు. రాగి పంటను చిరుధాన్యాలలో రారాజుగా పేర్కొంటారు. ఆంధ్ర ప్రదేశ్‌లో రాగి పంటను సుమారుగా 90 వేల ఎకరాలలో సాగు చేస్తున్నారు. ఈ పంటను ప్రతికూల పరిస్థితులలో (తక్కువ నీరు, తక్కువ రసాయన మందుల వాడకం) కూడా సాగు చేసి అధిక గింజ మరియు చొప్ప దిగుబడిని పొందడానికి అనువైన రకలను ఎంపిక చేసుకొని తగిన సస్యరక్షణ మరియు సాగు మెళకువలను ఇక్కడ తెలిపిన సూచనలను పాటించాలి.

**నేలలు :** ఇసుక మరియు బరువు నేలలు అనుకూలం, నీరు ఇంకని భూములు సాగుకు పనికిరావు.

**రకాల ఎంపిక :** ఏ పంటలోనైనా అధిక దిగుబడిని సాధించడానికి మేలైన వంగడాల ఎంపిక చాలా ముఖ్యం. ఖరీఫ్‌లో రాగిపంటలో అధిక దిగుబడిని పొందడానికి అనుకూలమైన రకాలు.

| రకము | ఋతువు (రోజులు) | పంటకాలం (క్వి/ఎ) | దిగుబడి | గుణగణాలు |
|---|---|---|---|---|
| వకుళ | ఖరీఫ్, రబి | 105-110 | 14-16 | బెట్టను మరియు అగ్గి తెగులును, కొంత వరకు తట్టుకొనును |
| శ్రీచైతన్య | ఖరీఫ్ | 110-115 | 12-16 | పైరు ఎత్తుగా పెరిగి పిలకలు బాగా వస్తాయి. అగ్గి తెగులును తట్టుకొనును. |
| గోదావరి | ఖరీఫ్, రబి | 120-125 | 12-16 | అన్ని ఋతువుల్లో పండించవచ్చు. పైరుకు ఎక్కువగా పిలకలు వస్తాయి. |
| తిరుమల | అన్ని కాలాలకు | 115-120 | 14-16 | అగ్గి తెగులును తట్టుకొంటుంది. చొప్ప దిగుబడి ఎక్కువ |
| వేగావతి | అన్ని కాలాలకు | 110-115 | 14-16 | అగ్గి తెగులును మరియు పాము పొడ తెగులును తట్టుకొంటుంది పైరు పడిపోదు. |
| సువర్ణముఖి | అన్ని కాలాలకు | 105-110 | 14-15 | వరిమాగాణుల్లో సాగు చేయడానికి అనుకూలం, అగ్గి తెగులు మరియు పాముపొడ తెగులును తట్టుకొంటుంది. |
| ఇంద్రావతి | అన్ని కాలాలకు | 115-120 | 14-15 | అగ్గి తెగులు మరియు పాముపొడ తెగులును తట్టుకొంటుంది |

**విత్తే సమయం :** ఖరీఫ్‌లో జూన్-జూలై మాసాల్లో విత్తడానికి అనుకూలము, జూన్-జూలై మాసం నారు నాటుకోవడానికి అనుకూలమైన సమయం.

**విత్తన మోతాదు, విత్తన శుద్ధి మరియు విత్తడం :** వెదజల్లే పద్ధతికి 4 కిలోల విత్తనం సరిపోతుంది. నారు నాటడానికి 3 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తన శుద్ధి చేయడానికి 2 గ్రా॥ కార్బండజిమ్ మందును ఒక కిలో విత్తనానికి కలపాలి. నేరుగా వెదజల్లే పద్ధతిలో మొలక శాతం బాగా రావాలంటే విత్తనాన్ని 10-12 గంటలు నీటిలో నానబెట్టి తరువాత పలుచటి గుడ్డలో కొద్దిసేపు ఆరబెట్టి ఇసుకలో కలిపి నేరుగా పొలంలో పలుచగా చల్లుకోవాలి. చల్లిన తరువాత బల్లకాని లేదా కంపతో కాని మట్టిని లాగాలి.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

**నారు మడి యాజమాన్యం :** ఒక ఎకరా పొలంలో రాగి నారు నాటుకోవడానికి 5 సెంట్లు విస్తీర్ణం (200 చ.మీ.)లో నారుమడిని తయారు చేసుకోవాలి. బాగా చివికిన పశువుల ఎరువును తగినంతగా చల్లి 2 కిలోల సూపర్ ఫాస్ఫేటును చల్లుకోవాలి. నారుమడి కొంత ఎత్తుగా చేసుకొని తయారు చేయాలి. విత్తన శుద్ధి చేసిన విత్తనాన్ని పలుచగా నారుమడిలో చల్లుకోవాలి. తర్వాత నారుమడిని తడుపుతూ రావాలి. నారుమడిలో నారును ఎప్పటికప్పుడు గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టిన యెడల ఆరోగ్యవంతమైన నారు తయారవుతుంది.

**పొలం తయారీ మరియు ఎరువుల యాజమాన్యము :** పొలంను బాగా దుక్కి చేయాలి. ఎకరానికి 2-4 టన్నుల బాగా చివికిన పశువుల ఎరువును మరియు 12 కిలోలు భాస్వరంను సింగిల్ సూపర్ ఫాస్ఫేటు రూపంలో 75 కిలోలు మరియు 8 కిలోలు పొటాష్‌నిచ్చే 15 కిలోలు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో వేసి బాగా కలియ దున్నాలి. నత్రజనిని యూరియా రూపంలో రాగి నారు నాటేముందు ఎకరానికి 26 కిలోలు నారు నాటిన తర్వాత 25-30 రోజుల తర్వాత (కలుపు తీసిన తరువాత) 26 కిలోలు పంటకు అందించాలి.

**కలుపు నివారణ :** నారు నాటిన తర్వాత 1-2 రోజుల లోపు (నీరు పెట్టిన తరువాత) తడి నేల ఉన్నప్పుడు పెండిమిథాలిన్ 30% కలుపు మందు ఎకరానికి 600 మి.లీ. మందును 200 లీ. నీటిలో కలిపి (3 మి.లీ./లీటరు నీటికి) కలుపుకుని పిచికారి చేసి కలుపును నివారించవచ్చును. (కలుపు మందు వేసిన తరువాత నీరు పెట్టరాదు). నారు నాటిన 25-30 రోజుల లోపు కూలీల ద్వారా తొలకలతో కలుపును తీయించిన నేల గుల్లబారి, పంటకు గాలి, వెలుతురు, పోషకాలు బాగా అంది, పిలకలు మరియు కంకులు బాగా ఏర్పడడానికి అవకాశముంటుంది. అలా కూలీలు దొరకని పక్షంలో ఎకరానికి 400 గ్రా. 2, 4-డి సోడియం సాల్ట్ 80% పొడి మందును 200 లీటర్ల నీటికి కలుపుకుని (2 గ్రా/ లీటరు నీటికి) కలుపు మొక్కలపై పిచికారి చేసి కలుపును నివారించవచ్చును.

**నీటి యాజమాన్యము :** సకాలంలో వర్షాలు పడి వర్షాధారం కింద రాగి సాగుచేసేవారు పంటను ఆలస్యం చేయకుండా విత్తుకోవాలి. నీటి వసతి కింద రాగి సాగు చేసేవారు నారును నాటేముందు నీరు పెట్టి నాట్లు వేయాలి. తర్వాత పైరు బాగా వేర్లు తొడిగే దాకా అంటే నాటిన 5-7 రోజుల తరువాత పులకతడి ఇవ్వాలి.

రాగి పంటకు కనీసము 5-6 తడులు ఖచ్చితంగా ఇవ్వాల్సిన అవసరముంటుంది. నాటేముందు, పిలకలు వేసేదశ, చిరుపొట్ట దశ, పూతదశ, మరియు గింజకట్టే దశలలో నీటి ఎద్దడి లేకుండా పంటకు నీరు అందించిన యెడల అధిక దిగుబడులు పొందే అవకాశముంటుంది.

**అంతర పంటలు :** ఖరీఫ్‌లో రాగి పంటను ఏక పంటగా కాకుండా రాగి పంటలో అంతర పంటలను సాగు చేసుకోవచ్చు. రాగి పంట దిగుబడితో పాటు అదనంగా అంతర పంటల నుండి కూడా దిగుబడి పొందడానికి అవకాశం వుంటుంది. రాగి పంటలో కందిని లేదా చిక్కుడును అంతర పంటగా క్రింద తెలిపిన నిష్పత్తిలో సాగు చేసుకోవచ్చు.

| | | |
|---|---|---|
| రాగి + కంది | : | రాగి : 8 వరుసలు (విత్తుదూరం - 30 సెం.మీ. × 10 సెం.మీ. |
| | | కంది : 2 వరుసలు (విత్తుదూరం - 60 సెం.మీ. × 20 సెం.మీ. |
| రాగి + చిక్కుడు | : | రాగి : 8 వరుసలు (విత్తుదూరం - 30 సెం.మీ × 10 సెం.మీ. |
| | | చిక్కుడు : 1 వరుస (విత్తుదూరం - 30 సెంనమీ. × 10 సెం.మీ. |



రాగి - ఇంద్రావతి



రాగి - తిరుమల (పిపిఆర్1012)

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# ఆకు కూరల సాగు – లాభాలు బాగు

**డా. ఎమ్. రవీంద్రబాబు,** సీనియర్ శాస్త్రవేత్త, **డా. జె.ఓం. ప్రసాద్,** టెక్నికల్ ఆఫీసర్, **డా. ఆర్.వి.యస్.కె. రెడ్డి,**
పరిశోదన సంచాలకులు, డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన పరిశోధనా స్థానం, వెంకటరామన్నగూడెం

## ఆకుకూరల ప్రాముఖ్యత :

ఆకు కూరలు సమీకృత పోషకాహారంలో చాలా ముఖ్యమైనవి. పోషకాలతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు అవసరమైన విటమిన్లు, ఖనిజ లవణాలు, ఫైటోహార్మోన్లు అందించటంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. పీచు పదార్థాలను అందించి జీర్ణశక్తిని పెంపొందిస్తాయి. తోటకూర, గోంగూర, పాలకూర, చుక్కకూర, మెంతికూర, బచ్చలి, పుదీనా, కొత్తిమీర మొదలగు ఆకుకూరలను మన రాష్ట్రంలో సంవత్సరం పొడవునా సాగు చేసుకోవచ్చు. అయితే పాలకూర, కొత్తిమీరలను వేసవిలో సాగు చేయటం కష్టం.

## ఆకుకూరలు – రకాలు : తోటకూర :

- **ఆర్.ఎన్.ఏ–1 :** ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల్లో ఖరీఫ్ మరియు వేసవిలో పండించుటకు అనువైన రకం. ఆకులు మరియు కాండం లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి. 15–20 రోజుల వ్యవధిలోనే ఎకరానికి 6–7 టన్నుల దిగుబడి ఇస్తుంది.
- **కో–1 :** ఆకులు వెడల్పుగా ముదురు ఆకుపచ్చ రంగులో, కాండం లావుగా కండ కలిగి ఉంటాయి. ఎకరానికి 3 –3.5 టన్నుల దిగుబడి 25 రోజులలో ఇస్తుంది.
- **కో–2 :** ఆకులు కోలగా ఉండి ముదురు ఆకుపచ్చ రంగులో పొడవుగా ఉంటాయి. కాండం లేతగా మృదువుగా ఉంటుంది. విత్తిన 30 రోజులలో కోతకి వస్తుంది. కాండం కూడా కూరగా పనికి వస్తుంది. ఎకరానికి 4–5 టన్నుల దిగుబడి ఇస్తుంది.
- **కో–3 :** విత్తిన 25 రోజుల నుండి కోత మొదలు పెట్టి 10 కోతల వరకు వారం రోజుల తేడాతో తీసుకోవచ్చు. ఎకరానికి 4–5 టన్నుల ఆకు దిగుబడి వస్తుంది.
- **కో–4 :** దీనిని ఆకు మరియు విత్తనం కొరకు పండించవచ్చు. మొక్కలు పొట్టిగా ఉండి చాలా త్వరగా పెరుగుతుంది. విత్తిన 20–25 రోజులలోనే కోతకి వచ్చి ఎకరానికి 3–3.5 టన్నుల ఆకు దిగుబడి వస్తుంది. తరువాత మొక్కలను విత్తనాల కోసం వదలాలి.
- **కో–5 :** ఈ రకంలో రెండు రకాల ఆకులు (ఆకుపచ్చ మరియు గులాబీ రంగు) కలిగి ఉండును కాండం పీచు లేకుండా మెత్తగా ఉంటుంది. ఆకులు కాండం చివరన గుబురుగా ఉంటాయి మొదటి కోత విత్తిన 25 రోజులకి మొదలు పెట్టి 55 రోజుల వరకు తీసుకొనవచ్చును. ఎకరానికి 16 టన్నుల వరకు దిగుబడి ఇస్తుంది.
- **పూసా కిరణ్ :** ఇది ఎర్ర తోటకూర రకానికి చెందినది. ఆకుల పైభాగాన ముదురు ఎరుపు రంగులో అడుగు భాగంనీలి ఎరపు రంగులో ఉండును. విత్తనాలు నాటిన తరువాత మొదటి కోత 24–33 రోజులకి వచ్చును. 8–10 రోజుల వ్యవధిలో నాలుగు సార్లు కోతలు చేయవచ్చును. సగటు దిగుబడి 2–2.5 టన్నులు.
- **అర్క సుగుణ :** పెద్ద పెద్ద ఆకులని ఇస్తుంది. ఎక్కువసార్లు కోతకి అనువైన రకం. ఆకులో నార తక్కువ కనుక తొందరగా ముదరదు. మొదటి కోత విత్తిన 15 రోజులలో వస్తుంది. అటు తర్వాత ప్రతి 10–15 రోజు వ్యవధిలో 90 రోజుల వరకు తీసుకోవచ్చు. ఒక ఎకరానికి 10 టన్నుల దిగుబడిని ఇస్తుంది.
- **సిరి కూర :** మొక్కలు పొట్టిగా ఆకులు చిన్నవిగా ఉంటాయి. కాండం వేరు కలిసే చోటు గులాబీ రంగులో ఉంటుంది. నాటిన 25 రోజులకి లేత మొక్కలని కాండంతో సహా కూరగా వాడుకోవచ్చు.









"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

**పాలకూర :** ఖరీఫ్ మరియు రబీ పంటగా బాగా అనుకూలం.

- **ఆల్ గ్రీన్ :** ఇది భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ, న్యూఢిల్లీ వారిచే విడుదల చేయబడిన రకం. ఒకే రకమైన లేత ఆకులు కలిగి ఉండి 20–25 రోజులకు ఒకసారి కోతకు వస్తుంది.
- **అర్క అనుపమ :** ఇది ఐ.ఐ.హెచ్.ఆర్., బెంగుళూరు వారు విడుదల చేసిన రకం. ఈ రకం అధిక దిగుబడి నివ్వడమే కాకుండా చాలా ఆలస్యంగా పూతకు వస్తుంది. ఎకరాకు 4–5 కోతలలో 16 టన్నుల ఆకు దిగుబడినిస్తుంది.
- **పూసా జ్యోతి :** ఆకులు వెడల్పుగా, లావుగా, లేతగా మృదువుగా ఉంటాయి. ఎకరాకు 6–8 కోతలలో 20 టన్నుల దిగుబడి నిస్తుంది.
- **పూసా పాలక్ :** ఇది కూడా ఐ.ఎ.ఆర్.ఐ, న్యూఢిల్లీ వారిచే విడుదల చేయబడినది. ఇది స్విస్ చార్డ్ × దేశవాళి పాలకూరల సంకరం నుండి ఎన్నుకొనబడింది.

**మెంతికూర :** లాం సెలక్షన్–1, పూసా ఎర్లీ బంచింగ్, కో–1, సువర్ణ

**చుక్కకూర :** లోకల్ రకాలు

**గోంగూర :** లోకల్ ఎరుపు మరియు తెలుపు రకాలు

**బచ్చలి : ఎర్ర బచ్చలి :** ఎర్రని కాండం తొడిమలు కలిగి ఉండటం వలన ఇంటి ఆవరణలలో ఆకర్షణ మొక్కగా కూడా పందిరి లేదా బాల్కనీల పైకి పాకించుకోవచ్చు. ఆకుకూరగా కూడా వినియోగించుకోవచ్చు

- **ఆకుపచ్చ బచ్చలి :** ఈ రకం కాండం ఆకులు ముదురు ఆకుపచ్చలో ఉండి పందిరి పైకి పాకించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.
- **పొద బచ్చలి :** మొక్కలు గుబురుగా పెరుగుతాయి. పందిళ్ళ అవసరం లేకుండా సాగు చేసుకోవచ్చు.

**మునగ :** మునగ ఆకులో ఇనుపధాతువు ఎక్కువగా ఉండటం వలన రక్తహీనతను తగ్గించడంలో బాగా ఉపయోగపడుతుంది. ఆకును ఎండబెట్టి నిలువ చేసుకొని చాలా రోజుల వరకు వినియోగించుకోవచ్చు. త్వరగా పెరిగే వార్షిక మునగ రకాలయిన పి.కె.ఎమ్–1, పి.కె.ఎమ్–2 రకాలు అనుకూలం.

**కొత్తిమీర :** చల్లని ప్రాంతాలలో సంవత్సరం పొడవునా, మిగతా ప్రాంతాలలో శీతాకాలపు పంటగా సాగు చేసుకోవచ్చు. వేసవి పంటగా మార్చి, ఏప్రిల్ నెలలో విత్తుకొని షెడ్ నెట్ క్రింద సాగు చేసుకోవచ్చు.

**అనువైన రకాలు :** అర్క ఈష, సురుచి రకాలు ఆలస్యంగా పూతకు వస్తాయి. కాబట్టి కొత్తిమీరకు బాగా అనుకూలం. ఇవి కాకుండా స్వాతి, సాధన, సింధు రకాలను కూడా సాగు చేసుకోవచ్చు.

- **తోటకూర :** ఎకరాకు 800–1000 గ్రా. విత్తనం అవసరం. ఈ విత్తనాన్ని 10 కిలోల ఇసుకతో కలిపి మడులలో పలుచగా చల్లి తర్వాత పలుచటి పొరగా మట్టిని కప్పాలి.
- **పాలకూర :** విత్తనాలు వెదజల్లి గాని 20 సెం.మీ. దూరంలో వరుసల్లో గాని విత్తుకోవాలి. విత్తనపు బంతిలో 2–3 విత్తనాలు ఉంటాయి. ఎకరాకు 10–12 కిలోల విత్తనం అవసరం అవుతుంది.
- **గోంగూర :** ఎకరాకు 6–8 కిలోల విత్తనం అవసరం. 20–25 సెం.మీ. ఎడంగా ఉండే వరుసల్లో నాటాలి.
- **చుక్కకూర :** ఎకరాకు 4–5 కిలోల విత్తనం కావాలి. వరుసల మధ్యదూరం 20–25 సెం.మీ. ఉండేలా విత్తాలి.
- **బచ్చలి :** తీగ బచ్చలిని 60×50 సెం.మీ. దూరంలో, పొదబచ్చలిని 45×30 సెం.మీ. దూరంలోను నాటుకోవాలి. పొద బచ్చలిని విత్తనం ద్వారాను, తాగబచ్చలిని విత్తనం మరియు కాండం ముక్కల ద్వారా పెంచుకోవచ్చు.
- **కొత్తిమీర :** ఎకరాకు 8–10 కిలోల విత్తనం అవసరం విత్తేముందు ధనియాల గింజలను రెండు బద్దలుగా చేసుకుని విత్తుకోవాలి. మడులు చేసి 15 సెం.మీ. దూరంలో వరుసలో విత్తుకోవాలి. ఆకు కూరలను వెదజల్లకుండా వరుసలలో నాటుకుంటే తరువాత కలుపు తీయడానికి సులువుగా ఉంటుంది. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకునేటపుడు 7–10 రోజుల వ్యవధిలో విడతలు విడతలుగా విత్తుకుంటే మార్కెట్ చేసుకునేందుకు అనువుగా వుంటుంది.









# ఆగష్టు మాసంలో డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం - రైతుల సలహా కేంద్రం ద్వారా ఫోన్-ఇన్ కార్యక్రమాల వివరాలు

| క్రమ సంఖ్య | తేది మరియు సమయం | అంశము | శాస్త్రవేత్త పేరు | మొబైల్ నెంబరు |
|---|---|---|---|---|
| 1. | 02-08-2021 మ.3 గం.ల నుండి 4.గంల వరకు | చీని, నిమ్మ తోటలలో అధిక సాంద్రత సాగు పద్ధతులు - కత్తిరింపుల యాజమాన్యం | డా. ఎల్. ముకుందలక్ష్మి సీనియర్ శాస్త్రవేత్త చీని, నిమ్మ పరిశోధన స్థానం, తిరుపతి | 9347115175 |
| 2. | 03-08-2021 మ. 3 గం.ల నుండి 4 గం.ల వరకు | కూరగాయల సాగులో తెగుళ్ళ యాజమాన్యం | డా. పి. రమాదేవి, సీనియర్ శాస్త్రవేత్త & హెడ్, ఉద్యాన పరిశోధన స్థానం వెంకటరామన్నగూడెం | 9491706717 |
| 3. | 04-08-2021 మ. 3 గం.ల నుండి 4 గం.ల వరకు | సేంద్రియ ఎరువుల తయారీ / వినియోగం | డా. వి. దీప్తి, శాస్త్రవేత్త కె.వి.కె. వెంకటరామన్నగూడెం | 9989575162 |
| 4. | 05-08-2021 మ. 3 గం.ల నుండి 4 గం.ల వరకు | జామలో కొమ్మ కత్తిరింపులు | డా. పి. అశోక్, సీనియర్ శాస్త్రవేత్త ఉద్యాన పరిశోధన స్థానం వెంకటరామన్నగూడెం | 9440834898 |
| 5. | 06-08-2021 మ. 3 గం.ల నుండి 4 గం.ల వరకు | బొప్పాయి తోటలలో సూక్ష్మధాతు లోపాలు-నివారణ | డా. వై.శరత్ కుమార్ రెడ్డి శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన స్థానం అనంతరాజుపేట | 9966642541 |
| 6. | 07-08-2021 మ. 3 గం.ల నుండి 4 గం.ల వరకు | పాలిహౌస్‌లో కాప్సికం సాగు | డా. కె. రాజేంద్రప్రసాద్, శాస్త్రవేత్త ఉద్యాన పరిశోధన స్థానం పందిరిమామిడి | 7382633663 |
| 7. | 09-08-2021 మ. 3 గం.ల నుండి 4 గం.ల వరకు | చీని, నిమ్మ సాగులో నీటి యాజమాన్యం | డా. బి. గోవిందరాజులు ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ కె.వి.కె., పెరియవరం | 9441937460 |
| 8. | 10-08-2021 మ. 3 గం.ల నుండి 4 గం.ల వరకు | కంద సాగులో యాజమాన్య పద్ధతులు | డా. కె. మమత సీనియర్ శాస్త్రవేత్త ఉద్యాన పరిశోధన స్థానం, కొవ్వూరు | 9441089174 |
| 9. | 11-08-2021 మ. 3 గం.ల నుండి 4 గం.ల వరకు | అరటిలో సమగ్ర కలుపు మరియు నీటి యాజమాన్యం | డా. జి. రామానందం | 7382633659 |
| 10. | 12-08-2021 మ. 3 గం.ల నుండి 4 గం.ల వరకు | కొబ్బరి తోటలలో అధిక దిగుబడులకు పాటించవలసిన మెళకువలు | డా. బి.వి.కె. భగవాన్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్, ఉద్యాన పరిశోధన స్థానం అంబాజీపేట | 7382633653 |

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

| | | | | |
|---|---|---|---|---|
| 11. | 13-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | గొర్రెలు మరియు మేకలలో సంభవించే వివిధ వ్యాధుల యాజమాన్యం | డా. పి. మంజరి<br>శాస్త్రవేత్త<br>కె.వి.కె. పెరియవరం | 8950039083 |
| 12. | 16-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | చీని, నిమ్మ సాగులో ఎరువుల యాజమాన్యం | డా. సి. మధుమతి, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్, చీని, నిమ్మ పరిశోధన స్థానం పెట్లూర్ | 7382633670 |
| 13. | 17-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | పెరటి తోటల పెంపకం ద్వారా ఆహార మరియు పోషణ భద్రత | డా. ఇ. కరుణశ్రీ<br>ప్రధాన శాస్త్రవేత్త & హెడ్<br>కె.వి.కె. వెంకటరామన్నగూడెం | 7382633692 |
| 14. | 18-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | సేంద్రియ పద్ధతిలో పసుపు సాగు | డా. బి. తనూజప్రియ<br>సీనియర్ శాస్త్రవేత్త<br>ఉద్యాన పరిశోధన స్థానం, లాం | 9490083422 |
| 15. | 20-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | ఉల్లి మరియు వెల్లుల్లిని ఆశించే తెగుళ్ళ సమగ్ర నివారణ | డా. కె. సుబ్రహ్మణ్యం | 7382633690 |
| 16. | 21-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | తమలపాకు కొత్త తోటల పెంపకం మరియు పాత తోటల్లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు | డా. డి. అపర్ణ, శాస్త్రవేత్త<br>ఉద్యాన పరిశోధన స్థానం<br>వెంకటరామన్న గూడెం | 8309861163 |
| 17. | 23-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | చీని, నిమ్మ తోటలలో వేరు కుళ్ళు, తెగుళ్ళ సమగ్ర యాజమాన్యం | డా. టి. రాజశేఖరం, శాస్త్రవేత్త<br>చీని, నిమ్మ పరిశోధన స్థానం<br>తిరుపతి | 8019181602 |
| 18. | 24-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | సీతాఫలంలో పురుగులు మరియు తెగుళ్ళ యాజమాన్యం | డా. పి. దీప్తి, శాస్త్రవేత్త &హెడ్, ఉద్యాన పరిశోధన స్థానం, అనంతపురము | 7013156054 |
| 19. | 25-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | జీడిమామిడిలో పోషక నిర్వహణ | డా. కె. ఉమామహేశ్వరరావు<br>శాస్త్రవేత్త, జీడిమామిడి పరిశోధన స్థానం<br>బాపట్ల | 9440479511 |
| 20. | 26-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | తేనెటీగల పెంపకం | శ్రీ జి. శాలిరాజు, శాస్త్రవేత్త<br>కె.వి.కె. వెంకటరామన్నగూడెం | 9491410128 |
| 21. | 27-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | వర్షాకాలంలో పూల తోటల పెంపకంలో మెళకువలు | డా. పి. లలిత కామేశ్వరి, సీనియర్ శాస్త్రవేత్త & హెడ్<br>కె.వి.కె. పందిరిమామిడి | 9440396330 |
| 22. | 28-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | మిరపలో ప్రధాన పొలం తయారీ, నాట్లు మరియు ఎరువుల యాజమాన్యం | డా. ఎ.రజిని, శాస్త్రవేత్త<br>ఉద్యాన పరిశోధన స్థానం, లాం | 9989809554 |
| 23. | 31-08-2021<br>మ. 3 గం.ల నుండి<br>4 గం.ల వరకు | వంగ మరియు బెండలో సమగ్ర సస్యరక్షణ చర్యలు | డా. ఎస్ ఆదర్శ, శాస్త్రవేత్త<br>కె.వి.కె. పందిరిమామిడి | 9492740791 |

"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ

నినాదం : ఉరుములు గర్జిస్తున్నప్పుడు లోపలికి వెళ్ళండి

## పిడుగుపాటు సమయంలో... చేయవలసినవి

### వాస్తవాలు

- మెరుపు సాధారణంగా అత్యంత ఎత్తైన వస్తువులను ఢీ కొడుతుంది.
- ఏ ప్రాంతము పూర్తిగా సురక్షితం కాదు. కానీ కొన్ని ప్రాంతాలు ఇతర వాటి కంటే సురక్షితమైనవి.
- చిన్న/బహిరంగ భవనాల కంటే, అన్ని వైపులా మూసివేసిన పెద్ద భవనాలు సురక్షితమైనవి.
- మెరుపులు, భారీ వర్షం కురుస్తున్న ప్రాంతానికి (-16 కి.మీ) వెలుపల వస్తాయి.
- ఒకే ప్రాంతంలో పదే పదే మెరుపులు రావచ్చును.
- మెరుపులు వలన ఎక్కువ మరణాలు మరియు గాయాలు బహిరంగ ప్రదేశాలలో ఉన్న ప్రజలకు మాత్రమే సంభవిస్తాయి.
- మెరుపు బాధితులను నీవు తాకవచ్చు (వారిలో విద్యుత్తు ప్రవాహం ప్రసరించదు) సత్వరమే వారికి సహాయం అందించండి.

### ముందస్తు సన్నద్ధత

- మెరుపులు నుండి రక్షణకు సంబంధించిన కరపత్రాలను / ఫ్లకార్డులను ప్రదర్శించడం.
- వాతావరణాన్ని పర్యవేక్షించి, స్థానిక వాతావరణంపై మీరంతట మీరే హెచ్చరిక జారీ చేసి/మీ ప్రాంతంలో జరగబోయే సంఘటనలను తెలియజేయాలి.
- మెరుపు అత్యవసర పరిస్థితి కోసం వైద్య మరియు పరిపాలనుకు అత్యవసరమైన సంప్రదింపుల కోసం వివరాలను సమకూర్చడం.
- తన/కుటుంబం కోసం అత్యవసర ప్రణాళికను తయారు చేయడం.
- అత్యవసర వస్తు సామాగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలి.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందని ముందస్తు హెచ్చరికలు జారీ చేసినట్లయితే వెలుపలి కార్యకలాపాలను వాయిదా వేసుకోవాలి.
- ఉపకరణాలు మరియు ఇతర ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్ వస్తువుల ప్లగ్ తీసివేయాలి. ఎయిర్ కండిషనర్లను ముందుగా ఆపివేయాలి.
- మీ గృహం/భవనం పరిసరాలలో ఉన్న పడిపోయిన, విరిగిపోయిన చెట్లు, కొమ్మలను తొలగించాలి.

### మీ ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం/మెరుపులు

**లోపల ఉన్నట్లయితే**

- మీ కిటికీలు, తలుపులు మూసివేయండి
- కిటికీలు, తలుపులు, అడ్డుగోడలు, ద్వారమండపాలు/అడ్డు గోడలకు దూరంగా ఉండండి.
- ఉరుముల చివరి శబ్దం విన్న తరువాత 30 నిమిషాలు వరకు లోపలనే ఉండండి.

**బహిరంగ ప్రదేశాలలో ఉన్నట్లయితే**

- సత్వరమే సురక్షిత ఆశ్రయంవైపు వెళ్ళండి (గట్టి భవనం).
- ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, మోటారు సైకిళ్ళు, సైకిళ్ళు మొదలైన వాటికి దూరంగా ఉండండి.
- వహనాన్ని నడుపుతున్నట్లయితే, సురక్షితంగా వెళ్లగలిగే రోడ్డు కోసం ప్రయత్నించి, చెట్లులేని, అకస్మాత్తుగా వరదలు రాని ప్రాంతాలలో పార్కింగ్ చేయాలి.
- సాధారణంగా, బహిరంగ ప్రదేశాలలో ఉండేదాని కంటే కిటికీలు మూసివేసి, లోహంతో కప్పబడిన వాహనాలలో (కార్లు, బస్సులు మొదలైనవి) ఆశ్రయం పొందడం ఉత్తమం.
- బహిరంగ ప్రదేశాలలో ఉండవలసి వస్తే అఖరి ప్రయత్నంగా సత్వరమే నీకాళ్ల బంతిగిన్నె కీళ్ళపై చతికలబడాలి/క్రిందకు వంగాలి, నీ చేతులలో నీ చెవులను మూసి, నీ మోకాళ్ళ మధ్య తల పెట్టాలి.
- వీలైనంతవరకు భూమికి తగల కుండా ఉండాలి.
- వదులుగా వేలాడుతున్న విద్యుత్తులైన్లకు దూరంగా ఉండాలి.
- అడవులలో దట్టంగా పెరిగిన చిన్న చెట్ల క్రింద దిగువ ప్రాంతాలలో ఆశ్రయం పొందాలి.
- ఇతర బహిరంగ ప్రదేశంలో కొండ కనుమ, లోయలు వంటి దిగువ ప్రాంతాలకు వెళ్ళేందుకు ప్రయత్నించాలి. (కాని ఆకస్మిక వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి)
- నీటిలో ఉన్నట్లయితే, భూమిపైకి రావటానికి ప్రయత్నించాలి, సత్వరమై సురక్షిత ఆశ్రయాన్ని కనుగొవాలి.

**మెరుపులు సంభవిస్తే**

- సత్వరమే వైద్య సహాయం, అంబులెన్స్ కోసం ఫోన్ చేయాలి.
- మెరుపు బాధితుడ్ని తాకడం సురక్షితమే, వైద్య సాయం అందించండి.
- శీతల, తడి పరిస్థితులలో హైపోథెర్మియా (అతి శీతల జ్వరం) ప్రమాదాన్ని తగ్గించడానికి బాధితుడు, భూమి మధ్య రక్షిత పొరను ఉంచండి.
- బాధితునికి క్రింది విధంగా సహాయం అందించాలి.
- శ్వాస ఆగిపోయినట్లయితే నోటికి నోరు అందించి శ్వాస పోయడం ప్రారంభించాలి.
- హృదయ స్పందన ఆగినట్లయితే వైద్యుల సహాయం అందే వరకు కార్డియోపల్మనరీ రీసఫికేషన్ (సిపిఆర్) చేయాలి.
- బాధితునికి నాడీ, శ్వాస సమస్యలున్నట్లయితే గాయాలు/కాలిన గాయాలు/దెబ్బతినడం/వినికిడి కోల్పోవడం/దృష్టి కోల్పోవడం జరిగిందేమో పరిశీలించాలి.

## పిడుగుపాటు సమయంలో... చేయకూడనవి

### హెచ్చరిక సంకేతాలు

- అధిక గాలులు, వర్షపాతం మరియు నల్లని మబ్బులు ముసురు కోవడం.
- పైన/సమీపాన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు రావడం.
- ఉరుములు తరచుగా తీవ్రంగా లేదా అధికంగా రావడం.

**సన్నద్ధత :** వరదలు సంభవిస్తే, ఎత్తు ప్రదేశాలు, కొండపై ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాలు, బీచ్‌లు, విడిచెట్లు, వాన/బస్/విహార యాత్రల ఆశ్రయాలు/సెల్‌ఫోన్ టవర్లు, జెండా దిమ్మెలు, విద్యుత్తు/విద్యుత్తు స్తంభాలు, లోహ కంచె, విడి వాహనాలు, నీళ్లలో ఉండరాదు.

**లోపల ఉన్నట్లయితే**

- ఎలక్ట్రిక్‌తో అనుసంధానమయివున్న కార్డెడ్ ఫోన్లు/మొబైల్స్/ఇతర పరికరాలు (ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్) వినియోగించరాదు/తాకరాదు. (అత్యవసర పరిస్థితులలో గోడకు బిగించని కార్డ్ లెస్, వైర్ లెస్ ఫోన్లను వినియోగించడం ఉత్తమం)
- ఉరుములు/మెరుపులు వచ్చిన తరువాత వెంటనే ఎలక్ట్రికల్ పరికరాలను వినియోగించరాదు.
- మీ చేతులను కడగరాదు, స్నానం/షవర్ చేయరాదు, పాత్రలను కడగరాదు, బట్టలను ఉతకరాదు.
- కాంక్రీటు గోడలకు ఎదురుగా కాంక్రీటు నేలలు పైన/ఏటవాలుగా ఉండకూడదు.
- ఏదైనా వాహక ఉపరితలాలను /లోహపు తలుపులు, కిటికీ (ఫ్రేములు, వైరింగ్, ప్లంబింగ్/నీటి కుళాయిలను) తాకరాదు.

**బహిరంగ ప్రదేశాలలో ఉన్నట్లయితే**

- ఉరుములు / వరదలు / మెరుపులు వచ్చిన సందర్భంలో చెట్టు క్రింద, సమీపంలో నిలబడరాదు.
- బహిరంగ ప్రదేశాలలో విడిగా ఉన్నషెడ్లు, ఇతర చిన్న నిర్మాణాలలో ఉండరాదు.
- వాహనంలోని లోహ/వాహక భాగాలను తాకరాదు. వదులుగా వేలాడుతున్న విద్యుత్తు తీగలకు దూరంగా ఉండండి.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# టూకీగా...

## రాష్ట్రంలో గొరక చేపల హేచరీలు



గొరక (తిలాపియా)... అత్యంత చౌక, ముళ్లు తక్కువగా ఉండే కాలువ చేప. రోడ్ సైడ్ రెస్టారెంట్లలో విరివిగా వాడే ఈ చేపలకు అమెరికా, సింగపూర్, చైనా, యూరోపియన్ దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ చేపల ఉత్పత్తిలో ప్రపంచంలోనే చైనా మొదటి స్థానంలో ఉంది. మనదేశంలో వీటి వినియోగం తక్కువే. మనరాష్ట్రం నుంచి ఎక్కువగా విదేశాలకు ఫిల్లెట్స్ రూపంలో ఎగుమతి చేస్తుంటారు. విదేశాల్లో ఉండే డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ చేపల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో ఈ చేప పిల్లల ఉత్పత్తి కోసం ముందుకొచ్చే ప్రైవేటు హేచరీలకు అనుమతివ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం రాష్ట్ర స్థాయిలో స్టీరింగ్ కమ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తు మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి పూనం మాలకొండయ్య ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటికే తిలాపియా హేచరీ ఏర్పాటు కోసం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఆనంద గ్రూప్ దరఖాస్తు చేసింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత హేచరీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చే విషయంలో నిర్ణయం తీసుకుంటుంది.




## అర లీటర్ సీసాలో బస్తా యూరియా

సంప్రదాయ యూరియా కన్నా శక్తివంతంగా పనిచేసే నానో యూరియా త్వరలోనే మార్కెట్‌లోకి రాబోతోంది. భారత రైతుల ఎరువుల సహకార సంస్థ (ఇఫ్కో) దీనిని ఇటీవల ఆవిష్కరించింది. ఎరువుల తయారీ రంగంలో ఇదో అద్భుత ఆవిష్కారం. నానో టెక్నాలజీపై కొన్నేళ్లుగా పరిశోధనలు సాగుతుండగా... ప్రపంచంలోనే తొలిసారిగా నానో యూరియాను ఇఫ్కో నానో బయో టెక్నాలజీ పరిశోధన సంస్థ అభివృద్ధి చేసింది.

**ఏమిటి నానో యూరియా...** తరతరాలుగా మనందరికీ తెలిసిన సంప్రదాయ యూరియా తెల్లటి గుళికల రూపంలో ఉంటుంది. బస్తాలలో వస్తుంది. దీని స్థానంలో ఇప్పుడు ద్రావణం రూపంలో ఉండే యూరియాను కేవలం 500 మి.లీ. సీసాలో పట్టేలా చేశారు. అంటే బస్తా యూరియాలో ఉండే పోషకాలు ఈ చిన్న సీసాలోకి వచ్చాయి. పైగా ఇది మహా శక్తివంతంగా పనిచేస్తుంది. భావి ఎరువుల మార్కెట్ రంగంలో ఇదో మేలి మలుపు అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడున్న వేపపూత యూరియా కన్నా ఇది వ్యవసాయ రంగంలో పెద్ద మార్పు తెస్తుందని భావిస్తున్నారు.

## అనకాపల్లి బెల్లం పొడికి పేటెంట్




చెరకు నుంచి సంప్రదాయ పద్ధతిలో రసాన్ని తీసి దాన్ని ఉడకబెట్టి బెల్లాన్ని తయారు చేస్తుంటారు. ఈ తరహా బెల్లంలో అంతర్గతంగా తేమ ఉండడం వల్ల సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది పాడవుతుంటుంది. ఈ నేపథ్యంలో అనకాపల్లిలోని అఖిల భారత సమన్వయ పరిశోధన సంస్థ (ఏఐసీఆర్‌పీ), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం (రార్స్) గుళికలు లేదా పలుకుల రూపంలో (గ్రాన్యూల్స్) ఉండే బెల్లాన్ని తయారుచేసే వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించింది. దీనికి గాను ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం వారికి బెల్లాన్ని గుళికలు, పొడి రూపంలో తయారు చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని, తయారీ పద్ధతుల్ని అందుబాటులోకి తెచ్చినందుకు 1970 పేటెంట్ చట్టం లోని నిబంధనలకు అనుగుణంగా 20 ఏళ్ల పాటు పేటెంట్ హక్కు కల్పించినట్లు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పేటెంట్ కార్యాలయం ప్రకటించిందని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎ. విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈ సాంకేతికతతో తయారయ్యే పలుకుల రూపంలో ఉండే బెల్లంలో అతి తక్కువ తేమ ఉంటుంది. తయారు చేసినప్పటి నుంచి రెండేళ్లపాటు నిల్వ ఉంటుంది. ప్యాకింగ్ సులువు. సూపర్ ఫాస్ఫేట్, ఫాస్పారిక్ యాసిడ్ వంటి ప్రమాదకర రసాయనాలను వినియోగించాల్సిన పనిలేదు. ఎగుమతికి అనువైంది. సంప్రదాయ పద్ధతిలో తయారుచేసి అమ్మే బెల్లం కన్నా రైతులు ఎకరానికి అదనంగా రూ.40 వేలు సంపాదించవచ్చు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

## టూకీగా...

# వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రివర్యుల సమీక్ష



బ్యాంకింగ్ సేవలను ఆర్బీకేల స్థాయికి తీసుకు వచ్చేందుకు కలెక్టర్లు బ్యాంకర్లతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గారు ఆదేశించారు. కౌలు రైతులకు నష్టం జరగకుండా కొత్త చట్టం తీసుకొచ్చామని, తద్వారా వారికి మేలు చేసే ప్రక్రియపై అవగాహన కలిగించాలని, వారికి రుణాలు వచ్చేలా చేయడం కలెక్టర్ల బాధ్యత అని స్పష్టం చేశారు. ఇ-క్రాపింగ్ అనేది చాలా ముఖ్యమని, ఇ-క్రాపింగ్ చేయకపోతే కలెక్టర్లు విఫలం అయ్యారని భావించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కనీసం 10 శాతం ఇ-క్రాపింగ్‌ను కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు పర్యవేక్షించాలని, లేదంటే రైతులు నష్టపోతారన్నారు. ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సన్నద్ధత, ఇ-క్రాపింగ్, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరాపై జిల్లా అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. ఇ-క్రాపింగ్ చాలా ముఖ్యం. వివాదంలో ఉన్న భూముల్లో పంట సాగు చేసినా... ఇ-క్రాపింగ్ చేయాలి. లేదంటే రైతు నష్టపోతాడు. ఇ-క్రాపింగ్ పూర్తి స్థాయిలో చేయకపోతే... కలెక్టర్లు విఫలం అయ్యారని భావించవచ్చు. దిగువనున్న సిబ్బంది కూడా ఇ-క్రాపింగ్‌ను పర్యవేక్షించాలి. లేకపోతే సేవల్లో నాణ్యత ఉండదు. ఇ-క్రాపింగ్‌పై శిక్షణ ఎవరైనా మిస్ అయి ఉంటే తిరిగి శిక్షణ ఇప్పిస్తాం అని చెప్పారు.

## చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

రాష్ట్రంలో మిల్లెట్ మిషన్‌ను వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. సజ్జ, జొన్న, రాగి, మొక్కజొన్న వంటి ముతక ధాన్యాలతో పాటు కొర్ర, వరిగలు, అండుకొర్రలు, సామలు వంటి చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం ఈ మిషన్ లక్ష్యం వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి చిరుధాన్యాల సాగును రెట్టింపు చేసి తక్కువ వ్యయంతో రైతులకు ఎక్కువ ఆదాయం దక్కేలా చేయాలన్నది ఉద్దేశం. దీనిలో భాగంగా సజ్జ, జొన్న, రాగి, మొక్కజొన్న వంటి పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటించగా కొన్ని చిరుధాన్యాలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతుధర ఇస్తోంది. ధరల్లో హెచ్చుతగ్గులు ఏర్పడినప్పుడు ధరలస్థిరీకరణ నిధితో జోక్యం చేసుకుంటోంది. అయినా మొక్కజొన్న తప్ప మిగతా చిరుధాన్యాల సాగు విస్తీర్ణం సంతృప్తికరంగా లేదు. సజ్జ, జొన్న, రాగి వంటి ముతక ధాన్యాలను ప్రజా పంపిణీవ్యవస్థ (పీడీఎస్) ద్వారా పంపిణీ చేస్తే ఉత్పత్తి పెరుగుతుందని, వ్యయ ప్రయాసలతో కూడిన పంటల నుంచి రైతులు చిరుధాన్యాల వైపు మరల్చవచ్చని సాగురంగ నిపుణుల అభిప్రాయం. చౌకడిపోల ద్వారా చిరుధాన్యాలను పంపిణీ చేయాలని రాష్ట్రప్రభుత్వం కూడా ప్రతిపాదించినా కరోనా నేపథ్యంలో అమల్లోకి రాలేదు. ముతక ధాన్యాలతో పాటు చిరుదాన్యాలను సాగు చేయడం వల్ల అటు రైతులకు, ఇటు వినియోగదారులకు మేలు జరుగుతుంది.

## కడపలో శిక్షణ కేంద్రం

రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధిచేసి అన్నదాతను ఆదుకునే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. పంటల సాగు మొదలుకుని, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, మార్కెటింగ్ తదితరఅన్ని విషయాల్లోనూ రైతుకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు సిద్ధమైంది. దిగుబడులు పెంచడంతోపాటు మార్కెటింగ్ సౌకర్యాలనూ మరింత మెరుగుపరిచి అన్నదాతకు అండగా నిలిచే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇందుకోసం రైతులతోపాటు సాగునీటి పారుదల శాఖ ఇంజినీర్లకూ రాష్ట్రస్థాయిలో శిక్షణకార్యక్రమాలను నిర్వహించ తలపెట్టింది. దీనిలో భాగంగా కడప కేంద్రంగా నీరు, భూమి నిర్వహణ శిక్షణ, పరిశోధన కేంద్రం (వాటర్ అండ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్)ను ఏర్పాటు చేయనుంది. సుమారు రూ.150 కోట్లతో 37 ఎకరాల్లో ఇది రూపుదిద్దుకోబోతోంది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఈ శిక్షణకేంద్రాన్ని ఇప్పుడు కడపలో ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కడపలో ప్రధాన పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటుచేసి దానికి అనుబంధంగా నెల్లూరు, అమరావతి, విశాఖపట్టణాల్లోనూ ఏర్పాటు చేస్తారు. అన్నిచోట్లా సొంతభవనాలు నిర్మిస్తారు.



# సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబరు 155251 కు రైతుల ప్రశ్నలు - సమాధానాలు

## వ్యవసాయ పంటలు

1. హనుమంతు రెడ్డి, పెద్దకౌగుంట గ్రా., ఉరవకొండ మం, అనంతపురం జిల్లా ఫోన్ : 8008404875

**ప్ర. వేరుశనగ 15 రోజుల పంటలో తుంగ ఎక్కువగా ఉంది, కలుపు మందును సిఫారసు చేయండి?**

జ. వేరుశనగ 15 రోజుల పంటలో తుంగ నివారణకు పర్స్యూట్ 250 మి.లీ ఎకరాకు పిచికారీ చేసుకోవాలి.

2. పాలగిరి మహేశ్వర రెడ్డి, సరిపిరల్ల గ్రా., కమలాపురం మం., కడప జిల్లా, ఫోన్ : 9494629609

**ప్ర. వేరుశనగ పంటలో ఆకులు గూడుగ ఉన్నాయి మరియు ఆకులు అంచులు నుండి ఎండుతునట్లు ఉన్నాయి నివారణ తెలుపండి ?**

జ. వేరుశనగ పంటలో ఆకు గూడు పురుగు ఉంది. నివారణకు మోనోక్రోటోఫాస్ ఏ 2.5 మి.లీ. ను 1 లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు సాఫ్ (మాంకోజబ్ కార్బెండిజమ్) 2 గ్రా. మందును 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

3. ఎం.మోహన్, కోడూరు గ్రా., రెడ్డివారిపల్లి మం., కడప జిల్లా, ఫోన్ : 7032142493

**ప్ర. సజ్జ పంట నాట్లు వేసి 3 రోజులు అయింది. దీనిలో కలుపు నివారణ మందు గురించి తెలుపగలరు?**

జ. అట్రాజిన్ 50 WP అనే పొడి మందును ఒక ఎకరానికి అంటే 600 గ్రా 200 లీటర్ల నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేయవలెను.

4. శ్రీనివాసులు, భూపనపాడు గ్రా., పాణ్యం మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 8639146131

**ప్ర. విత్తనశుద్ధిచేయటానికి రసాయనాలు ఉపయోగించవచ్చా?**

జ. రసాయనాలు మంచిదే కానీ, జీవ నియంత్రకాలు దుష్ఫలితాలు ఉండవు.

5. ఎ.ఈశ్వర్ రెడ్డి, చడమర్రు గ్రా., తనకల్లు మం., అనంతపురం, ఫోన్ : 6304920563

**ప్ర. కదిరి లేపాక్షి 1812 వేరుశనగ విత్తన మోతాదు, విత్తే సమయం, విత్తనశుద్ది గురించి తెలుపండి?**

జ. కదిరి లేపాక్షి 1812 వేరుశనగ ఎకరాకు 25 కిలోల మోతాదు చొప్పున జూన్-15 నుండి జూలై-15 మధ్యలో విత్తుకోవాలి, టెబ్యుకొనజోల్ 1గ్రాము/విటావాక్సువర్ 1.25 గ్రాము లేదా కార్బండిజమ్ 3 గ్రాములతో విత్తన శుద్ధి చేయాలి.

6. పి.వీర వెంకట కృష్ణ, కొత్తపల్లి గ్రా., ఐ.పోలవరం మం., తూర్పు గోదావరి జిల్లా, ఫోన్ : 9912872393

**ప్ర. వరిలో అధిక దిగుబడి ఇచ్చే నూతన వరి వంగడాలు తెలుపండి?**

జ. మారుటేరు రకాలైన MTU - 1318, మరియు MTU - 1271 సన్నరకం వేసుకోగలరు.

## ఉద్యాన పంటలు

7. మల్లికార్జున, ఎలికవారిపల్లి గ్రా., హనుమంతునిపాడు మం., ప్రకాశం జిల్లా. ఫోన్ : 6281839256

**ప్ర. నిమ్మ తోటలో కాయలు గోధుమ రంగు లోకి మారి పోతున్నాయి. నివారణ తెలుపండి ?**

జ. నిమ్మ తోట లో రాతిమంగు ఆశించినది. కాయ దశలో పూర్తి నివారణ లేదు. పిందె దశ లోనే సల్ఫర్ 3గ్రాములను 1 లీటరు నీటికి లేదా ప్రాపర్ గైట్ 1 మి.లీ మందును 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

8. బి.శ్రీనివాసుల రెడ్డి, పూల పాతూరు గ్రా., రాజంపేట మం., కడప జిల్లా, ఫోన్ : 9848634929

**ప్ర. బొప్పాయి తోట లో ఆకులు ముడుచుకుని తెల్లగా అవుతున్నాయి, నివారణ తెలుపండి?**

జ. బొప్పాయి తోటలో రసం పీల్చు పురుగులు ఆశించటం వలన ఆకులు ముడుచుకొని తెల్లగా మారుతున్నాయి. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056152 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."



9. రెడ్డప్ప, కలకాడ గ్రా., కలకాడ మం., చిత్తూరు, ఫోన్ : 9676776026

**ప్ర. మామిడిలో కాండం పై నుండి మొదలు వరకు పురుగు తొలుస్తుంది నివారణ తెలుపండి?**

జ. కార్బోఫ్యూరాన్ గుళికలు/మోనోక్రోటొఫాస్ ఏదైనా పురుగు మందులో దూదిని ముంచి కాండంపైన రంధ్రంలో వేసి ఆ రంధ్రం ను తడిమట్టితో మూసివేయాలి.

10. నాగేశ్వర రెడ్డి, మునిముడుగు గ్రా., ప్యాపిలి మం., కర్నూలు జిల్లా. ఫోన్ : 8341629972

**ప్ర. మిరప పంటలో ఆకులు పైకి ముడుచుకుంటున్నాయి. నివారణ తెలపండి?**

జ. మిరప పంటలో పై ముడత ఉంది. రసం పీల్చు పురుగు నివారణకు ఫిప్రోనిల్ ఏ 2 మి.లి.మందును 1లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

11. కె.మురళీకృష్ణ, కొత్తరేగ గ్రా., రామభద్రపురం మం., విజయనగరం జిల్లా. ఫోన్ : 8008363285

**ప్ర. జీడిమామిడి మొక్కలలో ఆకులు పై పురుగు ఉంది? నివారణ తెలపండి?**

జ. జీడిమామిడి మొక్కల పై పేనుబంక, పచ్చదోమలు ఆశించినది. నివారణకు డైమిథోయేట్ 200 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 50 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 160 మి.లీ. మందులలో ఏదైనా ఒకదానిని 100 లీటర్ల నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో పురుగు ఉధృతి తగ్గేంతవరకు పిచికారి చేసుకోవాలి. పక్షి కన్ను తెగులు నివారణకు కార్బెండిజమ్ 100 గ్రా. మందును 100 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

## మత్స్య శాఖ

12. భాషా, యస్. లింగందిన్నె గ్రా., ఆళ్లగడ్డ మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 9963929450

**ప్ర. చేపల మొప్పల నుంచి ఎక్కువగా జిగురు కారడంతో పాటుగా మొప్పలపై తెల్లటి చారలు కనిపిస్తున్నాయి. దీనికి నివారణ తెలుపండి ?**

జ. ఇది శంకు జలగ, దీని నివారణకు గాను డెల్టామెత్రిన్ (1.75%) 150 మి.లీ. ఎకరాకు చల్లాలి లేదా డైక్లోరో వాస్ (76%) ద్రావణం 1000 మి.లీ. ఎకరాకు చెరువు మొత్తం చల్లుకోవాలి.

13. శివ, అయ్యవారి పల్లి గ్రా., తాడిపత్రి మం., అనంతపురం జిల్లా, ఫోన్ : 8328449040

**ప్ర. చేపలు ప్రతి రోజు ఉదయం చెరువు పై భాగమునకు వచ్చి ముట్టెలు పైకి ఎత్తి తిరుగుతున్నాయి, దీనికి కారణాన్ని తెలుపండి?**

జ. చెరువులో ఆక్సిజన్ సమస్య ఉంది, దీని నివారణకు గాను రాత్రి 12 గంటల నుండి ఉదయం ఎండ వచ్చే వరకు చెరువు నీటిని చెరువులోకి తోడటం, మరియు మర బోటుతో చెరువు అంతా తిప్పడం ద్వారా చెరువులో ఆక్సిజన్ శాతాన్ని పెంచవచ్చు మరియు పొటాషియం పర్మాంగనేట్ 1కిలో ఎకరానికి చెరువు అంతా చల్లుకోవాలి.

14. స్వామి, భీమవరం గ్రా., భీమవరం మం., పశ్చిమ గోదావరి జిల్లా, ఫోన్ : 8500528047

**ప్ర. చేపల చర్మంపైన ఎర్రటి మచ్చలు వచ్చి చివరికి చనిపోతున్నాయి, నివారణ తెలుపండి ?**

జ. ఇది రెడ్ డిసీజ్(చేప యర్రబడే వ్యాధి). దీని నివారణకు ఆక్సీ టెట్రా సైక్లీన్ లేదా ఎన్రో ఫ్లాక్సాసిన్ ఉన్న యాంటీబయోటిక్ మందును 8-10 గ్రా. వంద కిలోల చేపల మేతలో కలిపి వరుసగా 7-10 రోజులు వరకు వాడాలి. నీటిలో బాక్టీరియా సాంద్రత తగ్గించడానికి బ్రోమిన్ (20%)/250 మి.లీ లేదా బెంజాల్కునీయంక్లోరైడ్ (50%) వంటి సానిటైజర్ 500 మీ.లీ. ఎకరాకు చెరువంతా చల్లుకోవాలి.

15. దిలీప్, అల్లూరు(గ్రా), కొత్తపట్నం(మం), ప్రకాశం(జిల్లా). ఫోన్ నెం: 7989655812,

**ప్ర. రొయ్యల మీసాల దగ్గర, తోక దగ్గర ఎరుపు రంగులో వచ్చి రొయ్యలు చనిపోతున్నాయి, నివారణ తెలుపండి?**

జ. చెరువులో విబ్రియో లోడ్ ఎక్కువగా ఉంది. దీని నివారణకు బెంజీన్ క్లోనింగ్ క్లోరైడ్ BKC (10-20% గాఢత) - 1000 మి.లీ/ఎకరానికి చెరువంత చల్లుకోవాలి.

16. రవి రాజ్ కుమార్, వేమపాడు(గ్రా), ద్వారకా తిరుమల (మం), పశ్చిమ గోదావరి(జిల్లా). ఫోన్ : 7993563913,

**ప్ర. రొయ్యలు తెలుపు దారాలు వంటి రెట్టలు వేస్తున్నాయి, రొయ్యలు సరిగా మేత తినటం లేదు, నివారణ తెలుపండి?**

జ. ఇది వైట్ గట్, దీని నివారణకు రొయ్యల మేతలు 50% తగ్గించి ఇస్తూ ఆర్గానిక్ ఆసిడ్స్ మరియు బాసిల్లస్ బాక్టీరియా గల ప్రొబయోటిక్స్ అందించటం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు మరియు PH ఎక్కువ కాకుండా చూసుకోవలెను.

## సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు

83310 56028
83310 56149
83310 56150
83310 56152
83310 56153
83310 56154



1. రామకోటి రెడ్డి, కారేడు గ్రా., ఉలవపాడు మం., ప్రకాశం జిల్లా. ఫోన్ : 9908775545

**ప్ర. వేరుశనగ పంటలో మొదళ్ళు కుళ్ళుపోతున్నాయి.నివారణ తెలపండి?**

జ. వేరుశనగ పంటలో మొదళ్ళు కుళ్ళు తెగులు నివారణకు క్లోరోథలోనిల్ (కవచ్) 2 గ్రాములు (లేదా) కార్బండజిమ్ 2 గ్రాములను 1 లీటరు నీటికి కలిపి మొదళ్ళు తడిచేల పిచికారీ చేసుకోవాలి.



2. సి. పురుషోత్తం, సోమనందంపురం, పెనుమగ్రు మం., చిత్తూరు జిల్లా. ఫోన్ : 9014714990

**ప్ర. వంగ పంట లో మొవ్వ మరియు కాయలలో పురుగు ఉంది. నివారణ తెలుపండి?**

జ. వంగ పంటలో కాయతొలుచు పురుగు ఆశించినది. నివారణకు క్లోరాంత్రినిలిప్రోల్ (కోరాజన్) 0.3 మి.లీ.లేదా థయోడీకార్బ్ 1.5 గ్రాముల మందును ఒక లీటరు నీటికి చొప్పున కలిపి 10 రోజుల వ్యవధిలో ఒక మందు తరువాత మరియొకటి పురుగు ఉధృతి తగ్గేంతవరకు పిచికారీ చేసుకోవాలి.



3. షేక్ మహబూబ్ బాషా, చాగలమర్రి గ్రా., చాగలమర్రి మం., కర్నూలు జిల్లా. ఫోన్ : 6302899150

**ప్ర. లిల్లీ మొక్కలలో మొగ్గలు కుళ్ళిపోతున్నాయి.నివారణ తెలపండి?**

జ. లిల్లీ (ట్యూబరోజ్) మొక్కలలో కాండం కుళ్ళు మరియు పూ మొగ్గ కుళ్ళు తెగులు నివారణకు కార్బెండిజమ్ ఏ 1 గ్రాము లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ ఏ 3 గ్రాములు మరియు 0.5 మి.లీ. జిగురు పదార్ధాని 1 లీటరు నీటికి కలిపి మొక్కంతా తడిచేలా పిచకారి చేయాలి.



4. మహేష్, హరపాలెం గ్రా., అచ్చుతాపురం మం., విశాఖపట్నం జిల్లా. ఫోన్ : 7336704258

**ప్ర. బెండ పంటలో కాయ లోపల పురుగు ఉంది. నివారణ తెలుపండి?**

జ. బెండ పంటలో కాయ తోలుచు పురుగు ఆశించింది. నివారణకు ఎకరానికి ఫ్లూబెండమైడ్ 80 మి.లీ. లేదా నోవాల్యూరాన్ 200 మి.లీ. లేదా థయోడికార్బ్ 300 గ్రాములు పిచికారీ చేసి నివారించుకోవచ్చును.



5. శరత్ కుమార్, లింగాపురం గ్రా., ఎస్.రాయవరం మం., విశాఖపట్నం జిల్లా ఫోన్ : 6301124957

**ప్ర. కొబ్బరి తోటలో కాండము పై రంధ్రాలు ఉన్నాయి.పురుగు నివారణ తెలపండి?**

జ. కొబ్బరి తోటలో ఎర్రముక్కు పురుగు ఆశించినది.నివారణకు పురుగు ఆశించిన చెట్ల మొవ్వలోని పురుగును తీసివేసి 100గ్రా. వేపపిండి 150 గ్రా. ఇసుక మిశ్రమాన్ని రంధ్రములో కూరాలి. మోనోక్రోటోఫాస్ 10 మి.లి. కలిపి వేరు ద్వారా మందు ఎక్కించాలి. మందు పెట్టిన 45 రోజుల వరకు కాయలు దింపరాదు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

6. కేశవులు, ఆకువీడు గ్రా., రాచర్ల మం., ప్రకాశం జిల్లా. ఫోన్ : 7330900892



**ప్ర. ప్రత్తి లో ఆకులు దగ్గరగా ముడుచుకుని పోతున్నాయి నివారణ తెలుపండి ?**

జ. ప్రత్తి లో తెల్లదోమ నివారణకు ఎసీటామీప్రిడ్ 20 SP అనే మందు 40గ్రాములు 200 లీటర్ల నీటికి (ఒక ఎకరా) లేదా డైఫెన్ థియోరాన్ 50 WP అనే మందు 250 గ్రాములు 200లీటర్ల నీటికి చొప్పున కలుపుకొని మొక్కలు బాగా తడిచేలా పిచకారి చేయవలెను



7. కే. దామోదరం, ముదురామపురం గ్రా., యడమరి మం., చిత్తూరు జిల్లా. ఫోన్ : 9849265144

**ప్ర. అరటి తోటలో ఆకులు పై మచ్చలు వచ్చి ఆకుల అంచులు నుండి ఎండిపోతున్నాయి. నివారణ తెలుపండి ?**

జ. అరటి పంటలో సిగటో ఆకుమచ్చ తెగులు ఆశించినది.తెగులు ఆశించిన ఆకులను మరియు తొడిమలను తీసి కాల్చివేయాలి. నివారణకు ప్రొపికోనజోల్ 1 మి.లీ. లేదా హెక్సకోనజోల్ 2 మి.లీ. మందును 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

8. తూముల కాంతారావు, బొందపల్లి గ్రా., గరివిడి మం., విజయనగరం జిల్లా. ఫోన్ : 9959597950



**ప్ర. బీర పాదు లో ఆకులు ముడుచుకుంటున్నాయి మరియు ఆకులు పై పసుపు పచ్చరంగు మచ్చలు ఉన్నాయి. నివారణ తెలుపండి ?**

జ. బీర పాదులో వెర్రి తెగులు పేనుబంక పురుగు ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకిన మొక్కలను పీకి దూరంగా తగులబెట్టాలి. 2 మీ.లీ. డైమిథోయేట్ లేదా 0.2 గ్రాముల ఎసిటామిప్రిడ్ మందును 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



9. రవి కుమార్, పుసులూరు గ్రా., కల్లూరు మం., కర్నూలు జిల్లా. ఫోన్ : 9550779660

**ప్ర. ఉల్లి పంటలో ఆకుల పై మచ్చలు ఉన్నాయి.నివారణ తెలపండి?**

జ. ఉల్లి లో ఊద రంగు మచ్చ తెగులు ఆశించినది. నివారణకు మాంకోజెబ్ M-45 ఏ 3 గ్రా. లేదా క్లోరోతలోనిల్ (కవచ్) ఏ 2.5 గ్రాముల మందును 1 లీటరు నీటికి కలిపి మార్చి మార్చి వారం వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయండి



10. వెంకటేష్, బాకీర్ సాహెబపేట గ్రా., చోడవరం మం., విశాఖపట్నం జిల్లా. ఫోన్ : 9100894544

**ప్ర. చెఱుకు పంటలో కాండము మీద మొదళ్లలో రంధ్రాలు ఉన్నాయి. నివారణ తెలపండి?**

జ. చెఱుకు పంటలో పీక పురుగు ఆశించినది. నివారణకు మోనోక్రోటోఫోస్ 1.6 మి.లీ.(ఎకరానికి 320 మి.లి.) లేదా క్లోరోపైరిఫాస్ 2.5మి.లీ. (ఎకరానికి 500మి.లి.) మందును 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయండి.

# సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు

**1. మామిడిలో ఆకులు కొమ్మలు ఎండిపోతున్నాయి, నివారణ తెలుపండి?**

జ. 40 గ్రాముల బెల్లంను లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో వేసవికాలం అయిపోయేవరకు పిచికారీ చేయాలి.

**2. కొబ్బరిలో మొవ్వవిరుస్తుంది, నివారణ తెలుపండి?**

జ. కొబ్బరిలో మొవ్వ విరవడానికి కారణం రైనోసిరస్ బీటిల్. దీని నివారణకు 10 మి.లీ మోనోక్రోటోఫాస్ మరియు 10మి.లీ నీటిని ఒక పాలిథిన్ కవర్ లో పోసి దానిని ఒక లేత వేరును కొద్దిగా కత్తిరించి ఒక అడుగు గుంత తవ్వి వేరుకు కట్టి 24 గంటలు ఉంచి పరిశీలించాలి.

**3. మామిడి నాటి 11 సంవత్సరాలు అవుతుంది, ఎరువుల యజమాన్యం తెలుపగలరు?**

జ. N:P:K=2.175:6.250:1.670 కేజీ/మొక్క రెండు దఫాలుగా వేయాలి.

**4. వేరుశనగలో పేనుబంక నివారణ తెలుపండి?**

జ. డైమిథోయేట్ 2 మి.లీ /లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**5. బీరలో పూత రాలిపోతుంది ,ఆదాయం తగ్గుతుంది,నివారణ తెలుపండి?**

జ: బోరాక్స్ 3 గ్రాములు /లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**6. ట్యూబ్రోజ్ పూలపై తామర పురుగు ఆశించినది,నివారణ చర్యలు తెలుపండి?**

జ. ఫిప్రోనిల్ 2 మి.లీ మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**7. బొప్పాయిలో మొదలు మరియు కాండం కుళ్లు తెగులు నివారణ చర్యలు తెలుపండి?**

జ. అలియటీ (ఫ్రాసీటైల్ ఏ.ఐ.80% డబ్ల్యూపి) 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**8. బెండ పంట లో తెల్ల దోమ నివారణ తెలుపండి?**

జ. డైమిథోయేట్ 2 మి.లీ మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**9. పెసర పంటలో పల్లాకు తెగులు ఎక్కువగా ఉంది. నివారణ తెలుపండి?**

జ. పెసర పంటలో పల్లాకు తెగులు నివారణకు మోనోక్రోటోఫాస్ 2 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి

**10. వరిలో అధిక దిగుబడి ఇచ్చే నూతన వరి వంగడాలు తెలుపండి?**

జ. మారుటేరు రకాలైన MTU61318, మరియు MTU-1271 సన్నరకం వేసుకోగలరు.

**11. రొయ్యలు తెలుపు దారాలు వంటి రెట్టలు వేస్తున్నాయి. రొయ్యలు సరిగా మేత తినటం లేదు, నివారణ తెలుపండి?**

జ. ఇది వైట్ గట్, దీని నివారణకు రొయ్యల మేతలు 50% తగ్గించి ఇస్తూ ఆర్గానిక్ ఆసిడ్స్ మరియు బాసిల్లస్ బాక్టీరియా గల ప్రొబయోటిక్స్ అందించటం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు మరియు PH ఎక్కువ కాకుండా చూసుకోవలెను.

**12. 4 నెలల పొట్టేలు పిల్లలు మేత తినటంలేదు, తక్కువ తింటున్నాయి. పరిష్కారం చెప్పండి?**

జ. పశు వైద్యుణ్ణి సంప్రదించి మొదట టెంపరేచర్ చూపించాలి. నులి పురుగు మందు వేయాలి. డాక్టర్ సలహాతో లివర్ టానిక్ వాడాలి.

**13. ఆవు ప్రసవించిన తర్వాత మాను లోంచి తెల్లని వాసనతో మట్టు కారుస్తుంది. నివారణ చర్యలు తెలుపండి?**

జ. ప్యూరియా బోలస్ గర్భంలోకి పెట్టాలి. అలాగే ఇంటాసెఫ్ – 3 గ్రాములు, మెలనెక్స్ 15 మి.లీ. ఇంజెక్షన్ను 3 రోజులు కండకి చేసుకోవాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# రైతుల స్పందన

నేను సాగు చేస్తున్నటువంటి చెరకు పంటలో కాండం తొలుచు పురుగు ఆశించగా సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని సంప్రదించగా వారి సూచన మేరకు ఒక ఎకరానికి కోరోజిన్ 60 ఎం.ఎల్. మందును పిచికారి చేయగా 3 రోజుల వ్యవధిలో పురుగు ఉధృతి తగ్గింది. సరైన సమయానికి వారిచ్చిన సూచనకు నా ధన్యవాదాలు.

లక్ష్మి
7330916912
ప్రొద్దుటూరు గ్రా., కంకిపాడు మం., కృష్ణా జిల్లా

ఉమామహేశ్వరరెడ్డి
6305670768
మాచపల్లి గ్రా., సిద్దవటం మం., కడప జిల్లా

నేను పండిస్తున్నటువంటి బెండ పంటలో ఆకు తినే పురుగు సోకగా సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని సంప్రదించాను. వారు సూచించిన మేరకు థయోడికార్బ్ 1 గ్రా. 1 లీ. నీటికి కలిపి వాడగా వారం రోజుల వ్యవధిలో పురుగు ఉధృతి తగ్గి ఫలితం కనిపించింది. కేంద్రానికి నా ధన్యవాదాలు

నేను సాగు చేస్తున్నటువంటి కొబ్బరి చెట్లకు సర్పిలాకార తెల్లదోమ ఆశించగా సమీకృత రైతు సమాచార కేంద్రం వారిని సంప్రదించగా నివారణగా పసుపు రంగు అట్టలను చెట్లకు పెట్టుకోవాలని సూచించారు. వాడితే ప్రయోజనం కనిపించింది. కేంద్రం సలహా నాకు మేలు చేసింది.

కాళేశ్వర్
9849381857
ఓడలరేవు గ్రా., ఓడలరేవు మం., తూ.గో. జిల్లా

వెంకటేశ్వర రెడ్డి
9603036934
నాగబత్తులవారిపాలెం గ్రా., తల్లూరు మం., ప్రకాశం జిల్లా

నేను సాగు చేస్తున్నటువంటి గుమ్మడి పంటలో పేనుబంక ఆశించగా సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని సంప్రదించాను. వారి సూచన మేరకు ఒక ఎకరానికి 400 ఎం.ఎల్. డైమిథోయేట్ మందును పిచికారి చేయగా 4 రోజులలో పురుగు ఉధృతి తగ్గి సత్ఫలితం కనిపించింది. సరైన సమయంలో వారిచ్చిన సలహాకు నా ధన్యవాదాలు

నేను సాగు చేస్తున్నటువంటి టమోటా పంటలో కాయతొలుచు పురుగు ఆశించగా సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని సంప్రదించి ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రా + మల్టీకే 2 కేజీలు లేదా ప్రొపికొనజోల్ 200 మి.లీ. ఎకరానికి చొప్పున పిచికారి చేయగా ప్రయోజనం కనిపించింది. కేంద్రం వారికి నా ధన్యవాదాలు.

శివారెడ్డి
9963326803
కొల్లగిరి గ్రా., గోరంట్ల మం., అనంతపురం జిల్లా

కృష్ణారావు
9912649751
ఎనికెపాడు గ్రా., సంతనూతలపాడు మం., ప్రకాశం జిల్లా

నేను వేసిన బొప్పాయి తోటలో ఆకుముడుత వైరస్ సోకగా సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని సంప్రదించి నివారణకు డైమిథోయేట్ (రోగార్) 2 మి.లీ. + వేపనూనె (1500 పి.పి.ఎం.) 2.5 మి.లీ. మందును 1 లీ. నీటికి కలిపి పిచికారి చేయగా తగు ఫలితం కనిపించింది. కేంద్రం వారికి నా కృతజ్ఞతలు.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# ఉత్తమ సేవలందిస్తున్న ఆర్‌బికె సిబ్బంది



**కె. మంగి**
నగరి మండలం
చిత్తూరు జిల్లా



**కె. వనూరప్ప**
ఉరవకొండ-2, ఉరవకొండ మండలం
అనంతపురం జిల్లా



**పి. మాణిక్యారావు**
చుండూరు మండలం
గుంటూరు జిల్లా



**వి. ప్రవల్లిక**
మచిలీపట్నం మండలం
కృష్ణా జిల్లా



**పి. కళ్యాణి**
బుచ్చి మండలం
నెల్లూరు జిల్లా



**రాయల సుప్రజ**
హెచ్.ఎం.పాడు మండలం
ప్రకాశం జిల్లా



**యం. సునీత**
రణస్థలం మండలం
శ్రీకాకుళం జిల్లా



**విజయ్ నిర్మల్**
పాములపాడు మండలం
కర్నూలు జిల్లా



**యల్. శేషగిరి**
జి.కె. వీధి మండలం
విశాఖపట్నం జిల్లా



**ఎస్. విజయలక్ష్మి**
లక్కవరపుకోట మండలం
విజయనగరం జిల్లా



**కె. సందీప్**
కామవరపుకోట మండలం
పశ్చిమ గోదావరి జిల్లా



**టి. నీహారిక**
వల్లూరు మండలం
వైఎస్ఆర్ కడప జిల్లా



**యం. సంఘమిత్రన్**
ఈతకోట-2, రావులపాలెం మండలం
తూర్పు గోదావరి జిల్లా



శ్రీ వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి గారు
గౌరవ ముఖ్యమంత్రి వర్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
శ్రీ కె. కన్నబాబు గారు
గౌరవ వ్యవసాయ, సహకార
మార్కెటింగ్ & ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామాత్యులు
డా|| వై.ఎస్.ఆర్. పొలంబడి
సమగ్ర పంటల యాజమాన్యం ద్వారా శాస్త్రీయమైన సేంద్రియ వ్యవసాయం దిశగా పయనం.
పంటల ఆవరణ వ్యవస్థల పరిరక్షణ
సాగు ఖర్చు తగ్గింపు.... దిగుబడి పెంపు
రైతుల సాధికారితను సాధించుట